www.flashindianews.com

FLASH INDIA NEWS
ప్రతిక్షణం.. ప్రజలకోసం...

# ఫ్లాష్ ఇండియా

తెలుగు దినపత్రిక

FLASH INDIA TELUGU DAILY

RNI NO.APTEL/2010/33229

విలేకరులు కావలెను

18సం॥ లుగా వెలుపడుతున్న "ఫ్లాష్ ఇండియా" తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు తెలంగాణ రాష్ట్రంలోని జిల్లాలు, నియోజకవర్గాల, మండలాల వారీగా విలేకరులు కావలెను..

★ ఆసక్తి గల అభ్యర్థులు సంప్రదించవలసిన నంబర్ ★

సెల్ నెంబర్: 9951494039

సంపుటి : 17 | సంచిక : 211 | గురువారం 01.10.2026 | ఎడిటర్ : కొమరరాజు శ్రీనివాసులు | పేజీలు : 08 | వెల రూ : 2/-

# నేతన్నల గడ్డపై గత పాలకుల నిర్లక్ష్యం

## కేటీఆర్, సంతోష్ రావు ఇసుక దందాలు

**సిరిసిల్లను 'ఉరిసిల్ల'గా మార్చారు**

**బీఆర్ఎస్ పాలనపై సీఎం రేవంత్ ఫైర్**



నేతన్నల గడ్డపై రాజకీయ పోరు మళ్లీ వేడెక్కింది

- నేతన్నల గడ్డకు గత పాలకుల అన్యాయం
- చేనేత కార్మికుల కన్నీళ్లకు ఎవరు కారణం?
- కేసీఆర్ కుటుంబ పాలనపై రేవంత్ ధ్వజం
- సిరిసిల్ల అభివృద్ధిని విస్మరించారంటూ విమర్శలు
- గల్ఫ్ బాధితులను పట్టించుకోలేదన్న రేవంత్
- కాళేశ్వరం పేరుతో అవినీతి జరిగిందని ఆరోపణ
- ఇసుక దందాలపై కేసీఆర్ కుటుంబాన్ని టార్గెట్ చేసిన సీఎం
- కేటీఆర్, సంతోష్‌రావుపై రేవంత్ తీవ్ర ఆరోపణలు
- ప్రజాధనం దోచుకున్నారంటూ రేవంత్ ఆరోపణ 03

**సిరిసిల్ల,ఫ్లాష్ ఇండియా :**
పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో నేతన్నల గడ్డ సిరిసిల్ల అభివృద్ధి చెందకపోగా, అది కాస్తా 'ఉరిసిల్ల'గా మారిపోయిందని సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. సిరిసిల్లలో నిర్వహించిన భారీ బహిరంగ సభలో సీఎం రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. కేసీఆర్ కుటుంబ పాలనపై, సిరిసిల్లలో జరిగిన అవినీతిపై నిప్పులు చెరిగారు.

**నేతన్నల గడ్డపై గత పాలకుల నిర్లక్ష్యం**
దైవం, ధైర్యం కలిసి వెలిసిన పవిత్ర ప్రాంతం సిరిసిల్ల అని, చేనేత కార్మికులు తమ అద్భుతమైన వృత్తి నైపుణ్యంతో 'అగ్గిపెట్టె చీర'ను సృష్టించి ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తెచ్చారని సీఎం కొనియాడారు. అలాంటి సిరిసిల్లను గత పాలకులు తమ స్వార్థ రాజకీయాల కోసం సమస్యల నిలయంగా మార్చేశారని విమర్శించారు. కార్మికుల కన్నీళ్లు, మగ్గాల చప్పుళ్లు నిలిచిపోయి, సంఘాల ఆందోళనలతో సిరిసిల్ల అంధకారంలోకి నెట్టబడిందని మండిపడ్డారు. రాష్ట్రంలో ఉద్యమ సమయంలో క్రియాశీలకంగా పనిచేసిన కేకే మహేందర్ రెడ్డికి మొండిచెయ్యి చూపి, అమెరికా నుంచి కేసీఆర్ తన కొడుకును ఇక్కడ బరిలోకి దింపారని ఎద్దేవా చేశారు. తెలంగాణ ఉద్యమాన్ని అడ్డుపెట్టుకుని కల్వకుంట్ల కుటుంబం వేల కోట్ల ఆస్తులను వెనకేసుకుందని ఆరోపించారు.

**కేటీఆర్, సంతోష్ రావు ఇసుక దందాలు**
అధికారంలో ఉన్న పదేళ్లలో కేసీఆర్ ప్రభుత్వం గల్ఫ్ వలసలను..

# కాంగ్రెస్‌లోకి మహా విలీనం..!

## జగన్, మమతా, పవార్‌కు భట్టి ఆహ్వానం

**కులం కోణంలో నేతలను చూడొద్దు: డిప్యూటీ సీఎం**

**కలిసి కాంగ్రెస్ సిద్ధాంతాలను బలోపేతం చేద్దాం**

- జగన్‌కు భట్టి బహిరంగ ఆహ్వానం
- సొంతగూటికి రావాలంటూ పాత నేతలకు పిలుపు
- జగన్‌పై భట్టి వ్యాఖ్యలతో ఏపీ రాజకీయాల్లో చర్చ
- కాంగ్రెస్‌లోకి పాత నేతలంతా రావాలి: భట్టి
- జగన్, మమతా, పవార్‌కు భట్టి ఆహ్వానం
- కలిసి కాంగ్రెస్ సిద్ధాంతాలను బలోపేతం చేద్దాం 02
- జగన్ రాకపై భట్టి వ్యాఖ్యలు ఆసక్తికరం
- రేవంత్‌తో విభేదాలు లేవన్న భట్టి




**రేవంత్ రెడ్డితో విభేదాలు లేవు**




## సంయుక్త ఆందోళనలకు కార్యాచరణ

- ఎస్ఐఆర్ పై విపక్షాల సమరభేరి
- సీఈసీపై 'ఇండియా' కూటమి పోరుబాట 05
- ఓటర్ల జాబితా సవరణపై ఢిల్లీలో కీలక భేటీ
- జ్ఞానేశ్ కుమార్ తొలగింపుపై విపక్షాల వ్యూహం

## జై శ్రీరామ్ అంటే రేవంత్ రెడ్డి భయపడుతున్నారు

- జై శ్రీరామ్ అంటే కాంగ్రెస్‌కు భయమా?: బండి
- హిందూ సమాజాన్ని చీల్చే ప్రయత్నాలు వద్దు: బండి
- రేవంత్ వ్యాఖ్యలకు బండి సంజయ్ కౌంటర్
- రాముడు, శివుడి పేరుతో రాజకీయాలా?: బండి 03

# టీఆర్ఎస్ నుంచి బీఆర్ఎస్..

## పేరు మారినా.. సిద్ధాంతం మారదు

- ఈసీ విశ్వసనీయతపై కేటీఆర్ ప్రశ్నలు
- ఎన్నికల సంఘంపై సుప్రీంకోర్టు జోక్యం కోరిన కేటీఆర్
- యువత ఉద్యమాలపై కేటీఆర్ కీలక వ్యాఖ్యలు 02
- రాహుల్ గాంధీపై కేటీఆర్ విమర్శలు
- బీఆర్ఎస్ లక్ష్యం.. తెలంగాణ దాటి దేశవ్యాప్త విస్తరణ
- తెలుగు నేల నుంచి జాతీయ రాజకీయాల దిశగా బీఆర్ఎస్
- రాముడు, శివుడి పేరుతో రాజకీయాలా?

బీఆర్ఎస్ జాతీయ పార్టీగా ఎందుకు ఎదగ కూడదు?





# 2 వేల మంది గిరిజనుల ఆవేదన..

**30 ఏళ్లుగా ఉంటున్నా.. పట్టాలు లేవు**

2 వేల గిరిజన కుటుంబాలకు పట్టాల డిమాండ్

దశాబ్దాలుగా నివాసం.. పట్టాలకు ఎదురుచూపు

- ఇళ్ల పట్టాలతో పాటు మౌలిక వసతులు కల్పించాలి
- గవర్నర్ జోక్యంతో సమస్య పరిష్కరించాలని విజ్ఞప్తి
- అసెంబ్లీ దృష్టికి వెళ్లినా.. పరిష్కారం శూన్యం 02

# 3 వేల కోట్ల విలువైన డ్రగ్స్ పట్టివేత

**లక్షద్వీప్ సమీపంలో భారీ డ్రగ్స్ కన్సైన్‌మెంట్ సీజ్**

**ఐదుగురు పాకిస్థానీల అరెస్ట్.. దర్యాప్తు ముమ్మరం**

- అరేబియా సముద్రంలో రూ.3 వేల కోట్ల డ్రగ్స్ పట్టివేత
- 526 కిలోల మాదకద్రవ్యాలతో ఇరాన్ బోటు పట్టివేత
- కోస్ట్‌గార్డ్ ఆపరేషన్‌లో అంతర్జాతీయ డ్రగ్స్ ముఠా గుట్టురట్టు
- లక్షద్వీప్ సమీపంలో భారీ డ్రగ్స్ కన్సైన్‌మెంట్ సీజ్ 05
- సముద్రమార్గంలో డ్రగ్స్ రవాణాకు చెక్




# రెడ్లకే రెండు ఎమ్మెల్సీ టికెట్ల వెనుక కుట్ర!..

**బీసీ వాదాన్ని దెబ్బతీసే కుట్ర: మల్లన్న**

టికెట్ల వ్యవహారం.. రాజకీయ వేడి పెంచిన మల్లన్న

**రెడ్డి వర్సెస్ బీసీగా ఎమ్మెల్సీ పోరు?**



- గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ టికెట్లపై రగడ
- రెండు సీట్లు.. ఇద్దరూ రెడ్డి అభ్యర్థులే
- కాంగ్రెస్ టికెట్లపై తీన్మార్ మల్లన్న ఫైర్
- బీసీలకు అన్యాయం జరిగిందంటూ విమర్శలు
- టికెట్ల వెనుక ఒప్పందం ఉందన్న మల్లన్న
- రెడ్డి అభ్యర్థులిద్దరూ బలిపశువులేనని వ్యాఖ్య 03

# సీఎంకు హరీశ్ రావు లేఖ

## రైతులకు కరెంట్ లేక.. రాజస్థాన్‌కు విద్యుత్ ఎందుకు?

**ఎల్‌నినో సాకుతో తప్పించుకుంటారా?**

తెలంగాణ విద్యుత్‌పై హక్కు ఎవరికి?

800 మెగావాట్ల విద్యుత్‌పై రాజకీయ రగడ



- రాజస్థాన్‌కు కరెంట్ తరలింపుపై తీవ్ర వ్యతిరేకత
- సింగరేణి కరెంట్ తెలంగాణకే ఇవ్వాలంటూ డిమాండ్
- 800 మెగావాట్ల విద్యుత్‌పై రాజకీయ రగడ
- విద్యుత్ ఒప్పందాన్ని రద్దు చేయాలి: హరీశ్ 05
- రైతులకు కరెంట్ లేక.. రాజస్థాన్‌కు విద్యుత్ ఎందుకు?
- సింగరేణి రూ.22 వేల కోట్ల పెట్టుబడిపై ప్రశ్నలు

# 4 ఏళ్లుగా తండ్రి మృతదేహాన్ని

## తండ్రిపై ప్రేమా? క్రయోనిక్స్‌పై నమ్మకమా?

- చనిపోయిన తండ్రి వస్తాడని.. నాలుగేళ్లు మృతదేహం దాచింది
- భవిష్యత్ వైద్యం నమ్మి.. తండ్రి మృతదేహం ఫ్రీజర్‌లో
- రూ.1.6 లక్షలు ఖర్చు.. నాలుగేళ్లుగా మృతదేహం భద్రత
- క్రయోనిక్స్‌పై నమ్మకంతో షాకింగ్ నిర్ణయం
- దుర్వాసనతో వెలుగులోకి వచ్చిన వింత ఘటన
- మృతదేహం దాచడంపై చట్టం ఏం చెబుతోంది? 05

మృతదేహం భద్రతపై వైద్య నిపుణుల పరిశీలన



# 2 వేల మంది గిరిజనుల ఆవేదన..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** ఆదిలాబాద్ జిల్లా మావల మండలం బట్టిసవర్గాం పరిధిలోని కొమురం భీమ్ కాలనీలో దాదాపు 30 ఏళ్లుగా నివాసముంటున్న 2,000కు పైగా పేద గిరిజన కుటుంబాలకు ఇండ్ల స్థలాలకు పట్టాలు మంజూరు చేసి వారికి ప్రాథమిక మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరుతూ తెలంగాణ రాష్ట్ర తుడుం దెబ్బ అధ్యక్షుడు గోడం గణేష్ బుధవారం తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాకు వినతిపత్రం సమర్పించారు. బీజేపీ ఎంపీ రఘునందన్ రావు, ఎమ్మెల్యే పాయల్ శంకర్ తో పాటు గవర్నర్ ను కలిసి తుడుందెబ్బ సభ్యులు సర్వే నంబర్ 72/23 పరిధిలో గోండ్, ప్రధాన్, కోలాం, తోటి, ఆంధ్, నాయక్‌పోడ్ తదితర షెడ్యూల్డ్ తెగలకు చెందిన పేద కుటుంబాలు, ముఖ్యంగా పీవీటీజీ తెగలకు చెందిన కుటుంబాలు దశాబ్దాలుగా శాశ్వత నివాసాలు ఏర్పరచుకుని నివాసముంటున్నా ఇళ్ల పట్టాలు లేకపోవడంతో వారంతా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అర్హులైన 2,000 కుటుంబాలకు తక్షణమే ఇళ్ల పట్టాల హక్కులు కల్పించేలా జోక్యం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

**కబ్జాల నుంచి రక్షించండి:**
కాలనీకి ఇంటి నంబర్లు కేటాయించి సీసీ/బిటి రోడ్లు, సురక్షితమైన తాగునీరు, డ్రైనేజీ వ్యవస్థ మరియు ఇతర కనీస సౌకర్యాలు కల్పించడంతో పాటు కాలనీలో విద్యుత్ కనెక్షన్లను క్రమబద్ధీకరించడంతో పాటు చిన్నారుల విద్య, వైద్యం కోసం అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, ప్రాథమిక ఆరోగ్య సేవలు అందుబాటులోకి తీసుకురావాలని ఈ సందర్భంగా కోరారు. పట్టణ ప్రాంతానికి సమీపంలో ఉన్న ఈ సర్వే నంబర్ 72/23 భూమికి విలువ పెరగడంతో కొందరు భూకబ్జాదారులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు గిరిజనులను ఖాళీ చేయించేందుకు బెదిరింపులకు దిగుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. బాధితులు ఆదిలాబాద్ ఎస్పీకి ఫిర్యాదు చేసినా పరిష్కారం లభించలేదని, దీనిపై సమగ్ర విచారణ జరిపి అక్రమార్కులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

**అసెంబ్లీ దృష్టికి తీసుకువెళ్లినా పరిష్కారం లేదు:**
స్థానిక జిల్లా కలెక్టర్, రెవెన్యూ, పోలీస్ అధికారుల ద్వారా క్షేత్రస్థాయి పరిశీలన జరిపించి, బాధితులకు నిర్దేశిత వ్యవధిలో న్యాయం జరిగేలా చూడాలని గవర్నర్‌ను అభ్యర్థించారు. ఈ సమస్యను ఇప్పటికే స్థానిక ఎమ్మెల్యే శాసనసభ దృష్టికి తీసుకెళ్లారని, ప్రజాప్రతినిధులు, అధికారులు హామీలు ఇచ్చినప్పటికీ ఇప్పటివరకు క్షేత్రస్థాయిలో పూర్తిస్థాయి పరిష్కారం లభించలేదని పేర్కొన్నారు. మానవీయ కోణంలో స్పందించి రాజ్యాంగబద్ధమైన జోక్యంతో ఈ పేద గిరిజన కుటుంబాల దశాబ్దాల సమస్యను పరిష్కరించేలా సంబంధిత అధికారులను ఆదేశించాలని తుడుం దెబ్బ నాయకులు గవర్నర్‌ను కోరారు.



## ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా శాఖ సభ్యుడిగా అడప సమ్మయ్య

**మహాదేవపూర్, ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :**
ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జయశంకర్ భూపాలపల్లి జిల్లా శాఖ మేనేజింగ్ కమిటీ సభ్యుడిగా మహాదేవపూర్ మండలం కాళేశ్వరం గ్రామానికి చెందిన అడప సమ్మయ్య మరోసారి ఎన్నికయ్యారు. 2026-2029 కాలానికి నిర్వహించిన ఎన్నికల్లో ఆయన మేనేజింగ్ కమిటీ సభ్యుడిగా అవకాశం దక్కించుకున్నారు. గతంలో 2023-2026 కాలానికి కూడా మేనేజింగ్ కమిటీ సభ్యుడిగా కొనసాగిన ఆడప సమ్మయ్యకు, తాజాగా 2026-2029 కాలానికి రెండోసారి సభ్యుడిగా అవకాశం రావడం విశేషం. వరుసగా రెండోసారి జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ మేనేజింగ్ కమిటీలో సభ్యుడిగా ఎన్నిక కావడంపై కాళేశ్వరం గ్రామస్థులు, అభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# ఈ చిల్లర రాజకీయాలొద్దు..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** శ్రీరాముడు ధనికుల దేవుడని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై బీజేపీ ఎంపీ రఘునందన్ రావు ఘాటుగా రియాక్ట్ అయ్యారు. శ్రీరాముడు రిచ్ గాడ్ అయితే భద్రచాలం రాముడి వద్దకు తన సతీమణితో కోలిసి రేవంత్ రెడ్డి ఎందుకు తలంబ్రాలు తీసుకువెళ్లారో సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. మేము ద్రవిడులమని శివుడిని కొలుస్తామని చెప్పిన రేవంత్ రెడ్డి.. ఎప్పుడైనా శ్రీశైలం వెళ్లారా? కొమురవెల్లి మల్లన్నకు ఏమైనా చేశారా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ ఇంగ్లీష్ వ్యక్తి స్థాపించిన పార్టీ అని బ్రిటీష్ వాడు చెప్పినట్లు డివైడ్ అండ్ రూల్ ప్రకారమే ఆ పార్టీ నడుస్తుందన్నారు. చివరకు దేవుళ్లను కూడా విభజించాలనే రేవంత్ రెడ్డి చిల్లర రాజకీయాలు మేము చింతిస్తున్నామన్నారు. ఇవాళ ఢిల్లీలో మీడియాతో మాట్లాడిన ఆయన.. నరేంద్ర మోడీ అనేక సందర్భాల్లో శైవక్షేత్రాలను సందర్శించారని హర హర మహాదేవ నినాదాం మాకు నేర్పాల్సిన అవ-సరం లేదన్నారు.

**సిరిసిల్లాపై దండయాత్రతో ఒరిగేదేమి లేదు:**
మాజీ సీఎం కేసీఆర్ తాను గజ్వేల్ కు మా-త్రమే ముఖ్యమంత్రిలా వ్యవహరిస్తే రేవంత్ రెడ్డి ఈ మూడేళ్లుగా కొడంగల్ నియోజకవర్గానికే ముఖ్యమంత్రిలా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. నిధులు, ప్రాజెక్టులు అన్నీ కొండకల్ కే తరలించుకుపోతున్న రేవంత్ రెడ్డికి ఇప్పటికైనా తెలంగాణలో సిరిసిల్లా అనే మరో నియోజకవర్గం ఉందని గుర్తుకురావడం సంతోషకరం అన్నారు. రాష్ట్రంలోని 119 నియోజకవర్గాలని సమానంగా చూడాలి తప్ప రాజకీయల కోసం ఓ నియోజకవర్గంపై దండయాత్ర చేస్తానని చెబితే అది బీఆర్ఎస్ అయినా కాంగ్రెస్ అయినా ఎవరు చేసినా అది తెలివితక్కువ తనం అవుతుందన్నారు. రేవంత్ రెడ్డికి చేతనైతే రింగ్ రోడ్డు టెండర్ల కేసులోనో, ఫార్ములా ఈ రేస్ కార్ కేసులోనో కేటీఆర్ ను జైల్లో వేయాలి తప్ప వంద కార్లు వేసుకుని దండయాత్ర చేస్తానని వెళ్లడం వల్ల మీకు గానీ జనాలకు గాని ఏం ఉపయోగం అన్నారు.

**అక్టోబర్ నాలుగున మెదక్ కు అమిత్ షా:**
అక్టోబర్ 4న మెదక్ పార్లమెంట్ పరిధిలోని తూప్రాన్‌లో అమూల్ భారీ మిల్క్ బల్క్ యూనిట్ శంకుస్థాపనకు రాబోతున్నారు. ఇది జిల్లా రైతులకు ఓ పెద్ద శుభవార్త అన్నారు. భారత ప్రధాని నరేంద్ర మోడీ పుట్టిన రోజు పురస్కరించుకుని చేపట్టిన సేవా సంకల్ప్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఈ నెల 6వ తేదీన ఉదయం 11 గంటలకు రాష్ట్ర గవర్నర్ చేతుల మీదుగా జాతీయ రహదారి 765 డీజీ రామాయం పేట నుంచి సిద్దిపేట వరక 45కిలోమీటర్ల వరకు ఒకే రోజు 30 వేల బాదాం మొక్కలను ఒకేరోజు నాటి సంరక్షించే కార్యక్రమం చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

# మంచిపేరొచ్చినా.. చెడ్డ పేరొచ్చినా ఉద్యోగుల వల్లే

**కరీంనగర్,ఫ్లాష్ ఇండియా :** పేదల సమస్యల పరిష్కార వేదికలుగా కలెక్టరేట్ కార్యాలయాలు సక్రమంగా ఉపయోగపడాలని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. కరీంనగర్‌లో నూతనంగా నిర్మించిన కలెక్టర్ భవనాన్ని సీఎం రేవంత్ రెడ్డి ఘనంగా ప్రారంభించారు. ఆయనతో పాటు కేంద్ర మంత్రి బండి సంజయ్, మంత్రి పొన్నం ప్రభాకర్ ఉన్నారు. అనంతరం అక్కడే కలెక్టరేట్ ఆవరణలో నూతనంగా ఏర్పాటు చేసిన తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో ప్రభుత్వ పాలన, ఉద్యోగుల బాధ్యతలు, కేంద్ర-రాష్ట్ర సంబంధాలపై సీఎం పలు కీలక వ్యాఖ్యలు చేశారు.

**ఉద్యోగులే ప్రభుత్వ ప్రతినిధులు..**
సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడంలో ప్రభుత్వ ఉద్యోగులే కీలక ప్రతినిధులని సీఎం రేవంత్ రెడ్డి కొనియాడారు. సమస్యల పరిష్కారం కోసం కలెక్టరేట్‌కు లేదా ఇతర ప్రభుత్వ కార్యాలయాలకు సాయం కోసం వచ్చే ప్రతి ఒక్కరినీ ఉద్యోగులు తమ కుటుంబ సభ్యులుగా భావించి సేవలు అందించాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో 10.5 లక్షల మంది ప్రభుత్వ ఉద్యోగులు సుమారు 4 కోట్ల మంది ప్రజలకు సేవలు అందిస్తున్నారని తెలిపారు. కేవలం 3 శాతం మంది ఉద్యోగులు 97 శాతం ప్రజలకు సేవ చేయడం శ్రమతో కూడుకున్న పనైనప్పటికీ, ఎంతో బాధ్యతగా పనిచేయాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు.

**ఎన్నికల సమయం వచ్చినప్పుడే రాజకీయాలు..**
ప్రభుత్వానికి మంచి పేరొచ్చినా, చెడ్డ పేరొచ్చినా అది పూర్తిగా ఉద్యోగుల పనితీరు వల్లే ఉంటుందని సీఎం స్పష్టం చేశారు. ప్రజా సమస్యల పట్ల ఉద్యోగులు నిర్లక్ష్యం వహిస్తే ప్రభుత్వం సరిగా పనిచేయడం లేదనే భావన ప్రజల్లోకి వెళ్తుందని హెచ్చరించారు. అందరి సహకారంతోనే రాష్ట్రాన్ని ముందుకు తీసుకువెళ్తున్నామని, ఇంకా అనేక సమస్యలు ఉన్నందున వాటిని ప్రజలకు నిత్యం సేవలందిస్తూనే పరిష్కరించుకోవాల్సిన అవ-సరం ఉందని పేర్కొన్నారు. ఇక అర్బన్ ఛాలెంజ్ ఫండ్ కింద కేంద్ర ప్రభుత్వం నుంచి రూ.810 కోట్ల నిధులను విజయవంతంగా సాధించుకున్నామని సీఎం వెల్లడించారు. కేంద్రం రాష్ట్ర అభివృద్ధికి సహకరిస్తే దాన్ని బహిరంగంగా అభినందించడానికి తమకు ఎలాంటి శషభిషలు లేవని స్పష్టం చేశారు. ఎన్నికల సమయం వచ్చినప్పుడే రాజకీయాలు, ప్రత్యర్థులు ఉంటామని... మిగతా సమయాల్లో రాష్ట్రం, కేంద్రం కలిసికట్టుగా రాష్ట్రాభివృద్ధి కోసం పరస్పరం సహకరించుకునే ఆరోగ్యకరమైన ధోరణి ఉండాలని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

## చింతపల్లి ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఘనంగా పోషణ మాసం వేడుకలు



**నల్లగొండ జిల్లా/చింతపల్లి, ఫ్లాష్ ఇండియా ప్రతినిధి:**
చింతపల్లి మండల కేంద్రంలోని సాయి సుమంగళి గార్డెన్‌లో బుధవారం ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో 'పోషణ మాసం' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ సక్కుబాయి మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, చిన్నారులు సమతుల్యమైన పోషకాహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చని తెలిపారు. చిన్నారుల శారీరక, మానసిక ఎదుగుదలకు మొదటి 1000 రోజులు ఎంతో కీలకమని పేర్కొన్నారు. రక్తహీనత నివారణ, పోషకాహార లోపం వల్ల కలిగే సమస్యలు, వాటి నివారణ చర్యలపై మహిళలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు సంప్రదాయబద్ధంగా శ్రీమంతాల వేడుక నిర్వహించి పండ్లు, పోషకాహారం అందించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు అంజమ్మ, సుగుణ, యశోద, విజయలక్ష్మి, వసంత, ప్రసన్నలక్ష్మి, వైష్ణవి, డీసీ సతీష్, బీసీ శ్రీను, అంగన్‌వాడీ టీచర్లు, గర్భిణులు, బాలింతలు, మహిళలు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌లోకి మహా విలీనం..!

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** గత మూడు టర్ములుగా జాతీయ రాజకీయాలను శాసిస్తున్న బీజేపీకి రాబోయే ఎన్నికలు అంత సులభంగా ఉండబోవనే చర్చ జరుగుతున్న వేళ.. ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ చీఫ్ వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తిరిగి కాంగ్రెస్ పక్షానికి రాబోతున్నారనే చర్చ తెలుగు రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది. ఏపీలో రాజకీయ పరిణామాలు, జాతీయ రాజకీయాల్లో వస్తున్న మార్పుల నేపథ్యంలో జగన్ ఇండియాకూటమిలో చేరే అవకాశం ఉందని వైఎస్ విజయసాయిరెడ్డి చేసిన వ్యాఖ్యలు దుమారం రేపుతున్నాయి. ఈ నేపథ్యంలో తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. బుధవారం కొచ్చిలో జరిగిన 'ఇండియా టుడే కాంక్లేవ్ సౌత్ 2026 కార్యక్రమంలో మాట్లాడిన ఆయన.. కాంగ్రెస్ పార్టీని వీడి వెళ్లిన పాత నాయకులందరూ తిరిగి పార్టీలోకి రావాలని పిలుపునిచ్చారు.

**సొంతగూటికి రండి:**
ఆంధ్రప్రదేశ్‌తో పాటు దేశవ్యాప్తంగా కాంగ్రెస్‌ను వీడి సొంత పార్టీలు లేదా ఇతర పార్టీల్లో ఉన్న పాత నేతలందరినీ తిరిగి కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్నట్లు భట్టి తెలిపారు. దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డితో తాను పనిచేశానని, ఆయన కుమారుడు జగన్ మోహన్ రెడ్డితో నేరుగా పనిచేయకపోయినా.. పాత నేతలందరూ పార్టీలోకి తిరిగొస్తే అత్యంత



సంతోషించే వ్యక్తిని తానేనని పేర్కొన్నారు. జగన్, మమతా బెనర్జీ, శరత్ పవార్ వంటి పాత నేతలంతా తిరిగి కాంగ్రెస్ లోకి రావాలన్నారు. కాంగ్రెస్ సిద్ధాంతాల అమలు, దేశ బలోపేతం కోసం వారంతా మళ్లీ ఒకే వేదికపైకి రావాలని ఆకాంక్షించారు.

**రేవంత్ రెడ్డితో విభేదాలు లేవు:**
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో తనకు ఎలాంటి విభేదాలూ లేవని ఈ సందర్భంగా భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. రాహుల్ గాంధీ దళిత్ పాలిటిక్స్ గురించి మాట్లాడుతుంటే తెలంగాణలో అన్ని అర్హతలు ఉన్న మిమ్మల్ని కాదని రేవంత్ రెడ్డికి సీఎం పోస్టు ఇవ్వడం ఏంటని అడిగిన ప్రశ్నకు బదులిస్తూ కులం ఆధారంగా కాంగ్రెస్ నేతలను చూడకూడదన్నారు. పార్టీలో పనిచేస్తున్న ప్రతి నాయకుడు, కార్యకర్త కాంగ్రెస్‌లో భాగమేనని భట్టి అన్నారు. రేవంత్ రెడ్డి తాను ఇద్దరం కలసికట్టుగానే ప్రభుత్వం నడుపుతున్నామని చెప్పారు. కాంగ్రెస్ పార్టీలో ఏ ఒక్కరినీ కులం కోణంలో చూడబోమని తేల్చిచెప్పారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం సమష్టిగా పనిచేస్తోందని చెప్పారు. నాయకులంతా కలిసి చర్చించి, నిర్ణయాలు తీసుకుని కాంగ్రెస్ సిద్ధాంతాలను పాలనలో అమలు చేస్తున్నామని తెలిపారు.

**ఉచితాలు కావు.. ఆర్థిక వ్యవస్థకు ఊతం:**
కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణలో అమలు చేస్తున్న గ్యారెంటీ పథకాలు ఉచితాలు కాదని, అవి పేదలకు ఆత్మగౌరవాన్ని ఇవ్వడంతో పాటు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తాయని భట్టి స్పష్టం చేశారు. ఇందిరమ్మ ఇళ్లు, రాజీవ్ ఆరోగ్యశ్రీ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రైతు భరోసా వంటి పథకాల ద్వారా ప్రజల కొనుగోలు శక్తి పెరుగుతుందన్నారు. తెలంగాణ రూ.1 పన్ను చెల్లిస్తే తిరిగి కేంద్రం నుంచి కేవలం 43 పైసలు మాత్రమే వస్తోందని, దక్షిణాది రాష్ట్రాల పట్ల కేంద్రం వివక్ష చూపుతోందని విమర్శించారు. బిజెపి పాలిత ఉత్తరాది రాష్ట్రాలకు ఎక్కువ నిధులు కేటాయిస్తూ ఫెడరల్ స్ఫూర్తికి విఘాతం కలిగిస్తున్నారని మండిపడ్డారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియపై కేంద్ర ఎన్నికల సంఘం వ్యవహరిస్తున్న తీరును తీవ్రంగా తప్పుపట్టారు. బీజేపీకి ప్రయోజనం చేకూర్చేలా ఓట్ల తొలగింపు జరుగుతోందని ఆరోపించారు. ప్రజాస్వామ్యంలో నిష్పాక్షికంగా ఎన్నికలు నిర్వహించాల్సిన బాధ్యత ఈసీపై ఉందన్న భట్టి.. సీఈసీ జ్ఞానేష్ కుమార్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

# టీఆర్ఎస్ నుంచి బీఆర్ఎస్..

## షారుఖ్ ఖాన్ అని పేరు పెడితే అయిపోతానా?..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** టీఆర్ఎస్ నుంచి పార్టీ పేరు బీఆర్ఎస్ గా మార్చడంపై ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. నేను షారుఖ్ ఖాన్ అని పేరు పెట్టుకున్నంత మాత్రాన షారుఖ్ ఖాన్ అయిపోతానా?.. కేవలం పేరు మారినంత మాత్రాన పార్టీ సిద్ధాంతం, ఆలోచనా విధానం, నాయకత్వం, ప్రజల పట్ల ఉన్న అంకితభావం ఏమాత్రం మారవని స్పష్టం చేశారు. ఇవాళ ఇండియా టుడే కాంక్లేవ్ లో మాట్లాడిన కేటీఆర్.. తెలుగు సినిమాలు పాన్-ఇండియా స్థాయికి వెళ్లి విజయం సాధిస్తున్నప్పుడు, తెలుగు నేల వేదికగా పుట్టిన రాజకీయ పార్టీ జాతీయ స్థాయికి ఎందుకు వెళ్లకూడదని ప్రశ్నించారు. తెలంగాణలో చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను దేశంలోని ఇతర ప్రాంతాలకు విస్తరించి నిలదొక్కుకోవాలనే ఉద్దేశంతోనే టీఆర్ఎస్ ను బీఆర్ఎస్ గా మార్చామని చెప్పారు.

**మతాన్ని ఒకరు దేవుళ్లను మరొకరు..**
మత ప్రాతిపదికన దేశాన్ని విభజించేందుకు బీజేపీ కుట్రలు చేస్తుంటే కాంగ్రెస్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఏకంగా ప్రజలు ఆరాధించే రాముడు, శివుడి మధ్య విభేదాలు సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. ఈ రెండు జాతీయ పార్టీల అసలు విధానం ఇదేనని దుయ్యబట్టారు. ఉద్యోగాల కల్పన, ఎన్నికల సమయంలో బీజేపీ ఇచ్చిన హామీల అమలుపై చర్చించకుండా, ఇరు పార్టీలు ప్రజా సమస్యలను పక్కదోవ పట్టిస్తున్నాయని మండిపడ్డారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనపై ప్రజలు తీవ్ర విసుగు చెందారని, రెండేళ్లలో మళ్లీ కేసీఆర్ ముఖ్యమంత్రి కావడం ఖాయమని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి అయ్యేది తాను కాదని, ప్రజలు కోరుకుంటున్నది కేసీఆర్‌నేనని తేల్చిచెప్పారు.

**ఈసీ విశ్వసనీయతపై..**
ఎన్నికల సంఘం విశ్వసనీయతపై దేశవ్యాప్తంగా తీవ్రమైన సందేహాలు నెలకొన్నాయని కేటీఆర్ అన్నారు. ఇటీవల ఓ జాతీయ మీడియాలో వచ్చిన ఇన్వెస్టిగేషన్ కథనంలో పేర్కొన్న అంశాలు వాస్తవమేనని చాలామంది భావిస్తున్నారని అందువల్ల ఈ వ్యవహారంపై సుమోటోగా విచారణ చేపట్టాల్సిన బాధ్యత సుప్రీంకోర్టుపైఉందన్నారు. దేశంలో కేంద్ర బీజేపీ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని కేటీఆర్ పేర్కొన్నారు. సీజేపీ లాంటి సంస్థలు, విద్యార్థులు, 'జెన్ జీ' యూత్ వీధుల్లోకి వచ్చి ప్రభుత్వాన్ని నిలదీస్తుంటే, ప్రధాన ప్రతిపక్ష నాయకుడిగా రాహుల్ గాంధీ యువతతో కలిసి నడవడంలో, ప్రజలకు అండగా నిలబడటంలో పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు.

## నూతన కలెక్టరేట్ భవనం ప్రారంభించిన సీఎం రేవంత్



**కరీంనగర్,ఫ్లాష్ ఇండియా :** కరీంనగర్ సమీకృత కలెక్టర్ కార్యాలయం ప్రారంభించేందుకు విచ్చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి హెలిపాడ్ వద్ద అధికారులు పుష్పగుచ్చాలు ఇచ్చి ఘన స్వాగతం పలికారు. అనంతరం పోలీసుల గౌరవ వందనం స్వీకరించిన ముఖ్యమంత్రి కరీంనగర్ లోని నూతన సమీకృత కలెక్టర్ భవనాన్ని ప్రారంభించారు. అనంతరం తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల నాగేశ్వ-రరావు, శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, పొన్నం ప్రభాకర్, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, కేంద్ర మంత్రి బండి సంజయ్ పాల్గొన్నారు.






ఫ్లాష్ ఇండియా దినపత్రిక బుక్ చేసుకోవాలి అనుకుంటున్నారా లేదా మీ వ్యాపార ప్రకటనల కోసం మమ్మల్ని సంప్రదించండి
7730032999
flashindiadaily@gmail.com

# రెడ్లకే రెండు ఎమ్మెల్సీ టికెట్ల వెనుక కుట్ర!..



**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణలో రెండు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాలకు కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన అభ్యర్థుల అంశం రాష్ట్ర రాజకీయ వర్గాల్లో చర్చగా మారింది. మహబూబ్ నగర్-రంగారెడ్డి, హైదరాబాద్ స్థానానికి సామ రామ్మోహన్ రెడ్డి, నల్గొండ-ఖమ్మం- వరంగల్ స్థానం నుంచి రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డిలను అభ్యర్థులుగా ఖరారు చేస్తూ నిన్న ఏఐసీసీ అధికారిక ప్రకటన విడుదల చేసింది. అయితే రెండు స్థానాలకు రెడ్లను అభ్యర్థులుగా ప్రకటించడం తీవ్ర దుమారం రేపుతోంది. రాష్ట్రంలో బీసీ నినాదం బలంగా వినిపిస్తున్న తరుణంలో బీసీలకు న్యాయం చేస్తామని చెబుతున్న కాంగ్రెస్ పార్టీనే ఇలా రెండు స్థానాలకు అగ్రవర్ణాలకు టికెట్లు ఇవ్వడంపై రాజకీయ వర్గాల్లో చర్చగా మారిన నేపథ్యంలో ఈ అంశంపై తెలంగాణ రాజ్యాధికార పార్టీ అధినేత, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న సంచలన వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ అధిష్టానం నిర్ణయం తమకు ఎలాంటి ఆశ్చర్యానికి గురి చేయలేదని రెడ్ల పార్టీ రెడ్లకు టికెట్లు ఇవ్వకుండా బీసీలకు ఇస్తుందని భావించడం అంటే మనం పొరపాటు పడినట్లేనన్నారు.

**ఇద్దరూ బలిపశువులే:**

అభ్యర్థులుగా సామరామ్మోహన్ రెడ్డి, రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డిలకు టికెట్లు ఇవ్వడం వెనుక పెద్ద లోపాయికారి ఒప్పందం ఉందని, ఈ రెడ్డి అభ్యర్థులిద్దరూ కూడా బలిపశువులేనన్నారు. బుధవారం ఓయూట్యూబ్ చానల్‌తో మాట్లాడిన మల్లన్న.. ఈ రెండు స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ ఎన్నడు డిపాజిట్లు కూడా దక్కించుకున్న చరిత్ర లేదని మొదటి సారి నేనే గెలిచానన్నారు. కాంగ్రెస్ పార్టీలోని రెడ్లంతా ఓ డ్రామాకు తెర లేపారని దీన్ని నేను చాలా కాలం క్రితమే పసిగట్టానన్నారు. త్వరలోనే ఇదంతా బయటకు రాబోతోందన్నారు. మహబూబ్ నగర్-రంగారెడ్డి, హైదరాబాద్ స్థానానికి సామ రామ్మోహన్ రెడ్డి, నల్గొండ- ఖమ్మం- వరంగల్ స్థానం నుంచి రెడ్లు శాసనమండలిలో అడుగుపెట్టబోరన్నారు. నా అంచనా ప్రకారం బీఆర్ఎస్‌లోని ఓ వ్యక్తితో ఒప్పందం కుదిరిందన్నారు.

**ఇదంతా ఆయన కుట్ర:**

కాంగ్రెస్ పార్టీ రెండు స్థానాల్లో రెడ్లకు టికెట్లు ఇవ్వడం వెనుక జానారెడ్డి కుట్ర ఉందని ఆయనతో పాటు టీచర్ ఎమ్మెల్సీగా ఉన్న ఓ రెడ్డి, మరో రెడ్డి కలిపి చర్చలు జరిపారని సంచలన వ్యాఖ్యలు చేశారు. అయితే వీరి ప్రయత్నమల్లా పార్టీలు గెలవడం కాదని రెడ్లు గెలవాలన్నదే వారి ముఖ్య ఉద్దేశం అని చెప్పుకొచ్చారు. రాష్ట్రంలో అసలు బీసీ వాదమే లేదని నిరూపించేందుకు చేస్తున్న ప్రయత్నమే ఇదంతా అని, ఈ ఎన్నికలు రెడ్లు, వెలమలు వర్సెస్ బీసీల మధ్య జరుగుతున్న ఎన్నికలన్నారు. ఈ ఇద్దరు రెడ్లను ముందు పెట్టి నెక్ట్స్ స్టెప్‌లోకి వెళ్లబోతోందని త్వరలోనే ఇవన్నీ బయటకు రాబోతున్నాయన్నారు. టీఆర్పీ పార్టీ రెండు స్థానాల్లో బీసీ అభ్యర్థులను బరిలోకి దింపబోతోందని ఈ రెండు స్థానాలను తామే గెలుచుకోబోతున్నామని ధీమా వ్యక్తం చేశారు. తాను తిరిగి పోటీ చేయబోయే విషయం త్వరలో తెలుస్తుందన్నారు.



## నేడు తెలంగాణ కేబినెట్ భేటీ..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** మంత్రివర్గ సమావేశాన్ని రేపు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. నేడు మధ్యాహ్నం 3 గంటలకు రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన మంత్రిమండలి భేటీ కాబోతోంది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు బుధవారం అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. సమావేశంలో రాష్ట్రానికి సంబంధించిన పలు ముఖ్యమైన అంశాలు, సంక్షేమ పథకాలు మరియు అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించి కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది.

**ఉద్యోగులకు డీఏ ఆమోదం!:**

ఈ భేటీలో ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు సంబంధించిన రెండు కరువు భత్యాల(డీఏ) ఆమోదంతో పాటు పలు కీలక అంశాలపై చర్చ జరగనుంది. దసరా నుంచి రెండు డీఏలు అమలుచేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీని వల్ల రాష్ట్ర ఖజానాపై పడే భారం, నిధుల సర్దుబాటుపై మంత్రివర్గం చర్చించి ఆమోదం తెలపనున్నట్లు సమాచారం. అలాగే రాష్ట్ర రాజకీయాలను షేక్ చేస్తున్న ధరణి, 22-ఏ అంశం, కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా సాగునీరు అందించేందుకు ఉన్న సాధ్యాసాధ్యాలు, ఎల్ నినో వంటి అంశాలు చర్చకు వచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

# ఎన్నికల సంఘం సంచలన నిర్ణయం..

**ఢిల్లీ :** స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియ చుట్టూ నడుస్తున్న తీవ్ర వివాదాల వేళ భారత ఎన్నికల సంఘం ఓ సంచలన నిర్ణయం తీసుకుంది. ఇకపై కొత్త ఓటరు నమోదు కోసం పూర్తి చేసే ఫారమ్-6 తో పాటు ఎలాంటి అదనపు డిక్లరేషన్ ఫారమ్ లేదా అన్ఎక్సర్-డి సమర్పించాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది. చట్టబద్ధమైన ఫారమ్-6 అసలు స్వరూపంలో తాము ఎలాంటి చట్టపరమైన మార్పులు చేయలేదని కేంద్ర ఎన్నికల సంఘం క్లారిటీ ఇచ్చింది.

**అసలు ఈ వివాదం ఎలా మొదలైంది..?**

ఓటర్ల జాబితాను మరింత ప్రక్షాళన చేసేందుకంటూ స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియ సమయంలో ఫారమ్-6 తో పాటు 'అన్ఎక్సర్-డి' అనే అదనపు డిక్లరేషన్ ఫారమ్‌ను ఈసీ తప్పనిసరి చేసింది. అయితే దీనిపై పెద్ద ఎత్తున అభ్యంతరాలు వ్యక్తమవ్వడంతో, ఎన్నికల సంఘం వెనక్కి తగ్గింది. ఎస్ఐఆర్ ప్రక్రియ ఇప్పటికే పూర్తయిన రాష్ట్రాల్లో ఆన్‌లైన్ ఫారమ్-6 నుంచి ఈ అదనపు డిక్లరేషన్ ఫారమ్‌ను తొలగించి, పాత పద్ధతినే పునరుద్ధరించింది. ఇకపై ఎస్ఐఆర్ లేని రాష్ట్రాల్లో ఎలాంటి అదనపు పత్రాలు లేకుండా పాత ఫారమ్-6 ప్రాతిపదికనే ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ దరఖాస్తులు స్వీకరిస్తారు. నిజానికి ఈ పాత ఫారమ్-6 కి, ఎస్ఐఆర్ తో కూడిన ఫారమ్-6 కి చాలా వ్యత్యాసాలు ఉన్నాయి. ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తయిన చోట ప్రతి ఓటరుకు సంబంధించిన తల్లిదండ్రులు, తాతముత్తాతలు లేదా కుటుంబ సీనియర్ల వివరాలు ఇప్పటికే డిజిటల్‌గా నమోదై ఉన్నాయి. కాబట్టి కొత్తగా ఓటరు కార్డు కోసం దరఖాస్తు చేసుకునేవారు తమ కుటుంబ సభ్యుల పాత ఓటింగ్ రికార్డులను మళ్లీ సమర్పించాల్సిన పనిలేదు. కానీ ఎస్ఐఆర్ నిబంధనల ప్రకారం దరఖాస్తుదారులు.. 2000ల ప్రారంభంలో జరిగిన పాత ఎస్ఐఆర్ సమయంలో తమ పేరు కానీ, తమ తల్లిదండ్రులు లేదా తాతముత్తాతల పేర్లు కానీ ఓటర్ల జాబితాలో ఉన్నాయో లేదో డిక్లేర్ చేయాల్సి వచ్చేది. అంతేకాకుండా తమ పూర్వపు నియోజకవర్గం సంఖ్య, పోలింగ్ బూత్ నంబర్, పాత సీరియల్ నంబర్ వంటి వివరాలను కచ్చితంగా పూర్తి చేయాల్సి వచ్చేది. సాంకేతికంగా ఈ వివరాల నమోదు ఐచ్ఛికమే (ఆప్షనల్) అని చెప్పినప్పటికీ, ECINET పోర్టల్‌లో ఆ వివరాలు ఎంటర్ చేయకుండా ఫారమ్ ముందుకు సబ్మిట్ అయ్యేది కాదు. దీంతో ముఖ్యంగా 2000ల తర్వాత పుట్టిన 18 ఏళ్ల యువతకు, మొదటిసారి ఓటు హక్కు పొందేవారికి ఈ పాత రికార్డులు వెతికి పట్టుకోవడం పెద్ద నరకంగా మారింది. గతంలో ఏదో ఒక కారణంతో ఓటు కోల్పోయినవారు తిరిగి పేరు నమోదు చేసుకోవాలన్నా అనేక చట్టపరమైన చిక్కులు ఎదురయ్యాయి. కానీ ఇప్పుడు పాత ఫారమ్-6 విధానం రావడం వల్ల ఎలాంటి పాత కుటుంబ వివరాల మ్యాపింగ్ అవసరం లేకుండా, యువత కేవలం తమ సాధారణ వ్యక్తిగత వివరాలు, వయస్సు, నివాస ధ్రువీకరణ పత్రాలు అప్‌లోడ్ చేసి నేరుగా ఓటు కోసం దరఖాస్తు చేసుకోవచ్చు.

**అసలు ఈ అదనపు డిక్లరేషన్ ఎందుకు తెచ్చారు?**

ఈ వివాదం ఎందుకు రేగిందంటే.. ఓటర్ల జాబితాలో అక్రమాలను, అక్రమ చొరబాటుదారులను అడ్డుకోవడానికే ఎస్ఐఆర్ కింద ఈ నిబంధన తెచ్చామని ఈసీ చెప్తోంది. అయితే ఎన్నికల సంఘం నిర్ణయంపై ఈసీ అంతర్గతంగానే తీవ్ర నిరసన వ్యక్తమైంది. ఓటరు నమోదు నిబంధనలు-1960 ప్రకారం చట్టబద్ధమైన ఫారమ్-6 లో మార్పులు చేసే అధికారం కేవలం పార్లమెంట్ ఆమోదంతో కేంద్ర ప్రభుత్వానికి మాత్రమే ఉంటుందని, ఎన్నికల సంఘం తనంతట తానుగా ఆన్‌లైన్ పోర్టల్‌లో దీన్ని నిర్బంధం చేయడం కుదరదని ఎలక్షన్ కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధూ, వివేక్ జోషిలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ అంతర్గత విభేదాలు, వివాదాల నేపథ్యంలో ఎన్నికల సంఘం దిగివచ్చి, ఎస్ఐఆర్ పూర్తయిన రాష్ట్రాల్లో ఈ నిబంధనను ఎత్తివేసి, ప్రస్తుతం ఎస్ఐఆర్ ప్రక్రియ నడుస్తున్న రాష్ట్రాలకు మాత్రమే దాన్ని పరిమితం చేసింది.

# నేతన్నల గడ్డపై గత పాలకుల నిర్లక్ష్యం

**సిరిసిల్ల,ఫ్లాష్ ఇండియా :** పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో నేతన్నల గడ్డ సిరిసిల్ల అభివృద్ధి చెందకపోగా, అది కాస్తా 'ఉరిసిల్ల'గా మారిపోయిందని సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. సిరిసిల్లలో నిర్వహించిన భారీ బహిరంగ సభలో సీఎం రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. కేసీఆర్ కుటుంబ పాలనపై, సిరిసిల్లలో జరిగిన అవినీతిపై నిప్పులు చెరిగారు.

**నేతన్నల గడ్డపై గత పాలకుల నిర్లక్ష్యం**

దైవం, ధైర్యం కలిసి వెలిసిన పవిత్ర ప్రాంతం సిరిసిల్ల అని, చేనేత కార్మికులు తమ అద్భుతమైన వృత్తి నైపుణ్యంతో 'అగ్గిపెట్టె చీర'ను సృష్టించి ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తెచ్చారని సీఎం కొనియాడారు. అలాంటి సిరిసిల్లను గత పాలకులు తమ స్వార్థ రాజకీయాల కోసం సమస్యల నిలయంగా మార్చేశారని విమర్శించారు. కార్మికుల కన్నీళ్లు, మగ్గాల చప్పుళ్లు నిలిచిపోయి, సంఘాల ఆందోళనలతో సిరిసిల్ల అంధకారంలోకి నెట్టబడిందని మండిపడ్డారు. రాష్ట్రంలో ఉద్యమ సమయంలో క్రియాశీలకంగా పనిచేసిన కేకే మహేందర్ రెడ్డికి మొండిచెయ్యి చూపి, అమెరికా నుంచి కేసీఆర్ తన కొడుకును ఇక్కడ బరిలోకి దింపారని ఎద్దేవా చేశారు. తెలంగాణ ఉద్యమాన్ని అడ్డుపెట్టుకుని కల్వకుంట్ల కుటుంబం వేల కోట్ల ఆస్తులను వెనకేసుకుందని ఆరోపించారు.

**కేటీఆర్, సంతోష్ రావు ఇసుక దందాలు**

అధికారంలో ఉన్న పదేళ్లలో కేసీఆర్ ప్రభుత్వం గల్ఫ్ వలసలను ఎందుకు నివారించలేకపోయిందని సీఎం రేవంత్ నిలదీశారు. ఉపాధి కోసం గల్ఫ్ దేశాలకు వెళ్లి అక్కడ కార్మికులు మృతి చెందితే, కనీసం వారి మృతదేహాలను స్వస్థలాలకు తీసుకొచ్చేందుకు కూడా ఆనాడు ప్రభుత్వం సహకరించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారంలో ఉన్న ఒక్కరోజు కూడా గల్ఫ్ బాధితుల గురించి కేసీఆర్ కుటుంబం పట్టించుకున్న పాపాన పోలేదని దుయ్యబట్టారు. గతంలో కేసీఆర్‌ను ఎంపీగా గెలిపించినా పాలమూరు జిల్లాలో కూడా ఎలాంటి మార్పు రాలేదని గుర్తుచేశారు. అమెరికాలో ఎన్ని చిప్పలు కడిగితే లక్ష కోట్లు వస్తాయని కేసీఆర్‌ను సీఎం రేవంత్ ప్రశ్నించారు. కేసీఆర్ కుటుంబానికి ఏ వ్యాపారం చేస్తే రూ. లక్ష కోట్లు వచ్చాయో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో కేసీఆర్ రూ. లక్ష కోట్లు కొల్లగొట్టారని ఆరోపించారు. ఆయన సడ్డకుడి కొడుకు సంతోష్ రావు మానేరు వాగులో ఇసుకను విచక్షణారహితంగా తోడేసి దోచుకున్నారని మండిపడ్డారు. కేటీఆర్‌తో కలిసి వేల కోట్ల రూపాయల ప్రజాధనాన్ని దోచుకున్నారని, వారి అవినీతిని ప్రశ్నించిన దళితులను లారీలతో తొక్కి చంపించింది నిజం కాదా అని తీవ్ర స్థాయిలో నిలదీశారు.

## జై శ్రీరామ్ అంటే రేవంత్ రెడ్డి భయపడుతున్నారు



**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** జై శ్రీరామ్ అంటే కాంగ్రెస్ పార్టీ, సీఎం రేవంత్ రెడ్డి భయపడుతున్నారని అందుకే హిందూ సమాజాన్ని చీల్చే ప్రయత్నం చేస్తున్నారని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. ఇవాళ కరీంనగర్ లో మీడియాతో మాట్లాడిన బండి సంజయ్.. హిందూ దేవుళ్లపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖలకు ఆయన కౌంటర్ ఇచ్చారు. హరహరమహదేవ అని మోడీ చేసిన నినాదం రేవంత్ రెడ్డికి వినపడలేదా? మోడీ పోటీ చేసిన వారణాసి శివుడిది కాదా అని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి వ్యాఖ్యలను కాంగ్రెస్ నేతలే విమర్శించే పరిస్థితి ఉందన్నారు. శివుడు, రాముడి పేరుతో ప్రజలను విడదీస్తే హిందూ సమాజం తిరగబడుతుందన్నారు. ఏబీవీపీ బీజేపీకి అనుబంధ సంస్థ కాదనే విషయాన్ని సీఎం గుర్తించాలన్నారు. సిద్ధాంత పరంగా బీజేపీ, ఏబీవీపీ ఒకటే కావొచ్చు, కానీ ఏబీవీపీలో ఉన్న ప్రతిఒక్కరు బీజేపీలోకి రావాలనే నిబంధన లేదన్నారు.

**సంఘపరివార్ గురించి మాట్లాడే అర్హత కాంగ్రెస్‌కు లేదు:**

సంఘ్ నీడ లేని చదువులు అందించేలా కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో విద్యారంగ సంస్కరణలపై నెల రోజుల్లోగా కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేయాలని నిన్న సీడబ్ల్యూసీ సమావేశంలో పార్టీ నిర్ణయించడంపై బండి సంజయ్ స్పందించారు. సంఘపరివార్ గురించి మాట్లాడే అర్హత కాంగ్రెస్‌కు లేదని బండి సంజయ్ అన్నారు. ఈ దేశంలో క్రమశిక్షణ కలిగిన సంస్థ ఏదైనా ఉందంటే అది ఆర్ఎస్ఎస్ అని ఇందిరా గాంధీ కూడా చెప్పేవారన్నారు. సంఘపరివార్ లేని భారతదేశాన్ని ఊహించుకునే పరిస్థితిలో ప్రపంచం లేదని చెప్పారు. కాంగ్రెస్ లో ఇప్పుడు ఉన్న నాయకులంతా కొత్తగా వచ్చిన వారేనని చరిత్రను తెలుసుకోవాలన్నారు.

# రైతులకు నీళ్లు ఇవ్వండి..

**గోదావరిఖని,ఫ్లాష్ ఇండియా :** రైతులకు సాగునీరు అందించడంపై దృష్టి పెట్టకుండా తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయాలు చేస్తోందని బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ ఆరోపించారు. బుధవారం రామగుండం ఎన్టిపిసి లో ఆయన విలేకరులతో మాట్లాడారు. సింగరేణి సంస్థను అమ్ముకునే దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని విమర్శించారు. రాష్ట్రంలో విద్యుత్ సరఫరా పరిస్థితి కూడా ఆందోళనకరంగా ఉందని, కరెంటు ఎప్పుడు ఉంటుందో, ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి నెలకొందని అన్నారు. ఆయన రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు.

**రైతులకు నీళ్లు ఇవ్వడం పై దృష్టి పెట్టాలి...**

రాష్ట్రంలోని రైతుల సమస్యలపై ప్రభుత్వం తక్షణం దృష్టి సారించాలని ఈటల రాజేందర్ డిమాండ్ చేశారు. వాతావరణంలో మార్పుల వలన పంటలకు తగినంత నీరందక కరువు పరిస్థితిలో వస్తున్నాయన్నారు. సాగునీటి విషయంలో రాజకీయాలకు తావివ్వకుండా రైతులకు అవసరమైన నీటిని అందించాలని కోరారు. రైతులు పంటలు సాగు చేసుకునేందుకు నీరు, విద్యుత్ అందుబాటులో ఉండటం అత్యంత కీలకమని పేర్కొన్నారు. ప్రభుత్వం రైతుల సమస్యలను పరిష్కరించడం పై దృష్టి పెట్టాలని సూచించారు.

**సింగరేణిని కాపాడాలి...**

తెలంగాణకు ఆర్థికంగా, పారిశ్రామికంగా కీలకమైన సింగరేణి సంస్థ విషయంలో ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలపై ఈటల రాజేందర్ ప్రశ్నలు లేవనెత్తారు. సింగరేణిని అమ్ముకునేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం చూస్తోందని ఆయన ఆరోపించారు. సింగరేణి సంస్థ ప్రయోజనాలను, కార్మికుల భవిష్యత్తును కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. బొగ్గు ఉత్పత్తి, విద్యుత్ ఉత్పత్తి, కార్మికుల సంక్షేమం తదితర అంశాలపై ప్రభుత్వం స్పష్టమైన విధానాన్ని వెల్లడించాలని డిమాండ్ చేశారు.

**కరెంటు సరఫరా పైన విమర్శలు...**

రాష్ట్రంలో విద్యుత్ కోతలపై కూడా ఈటల రాజేందర్ ప్రభుత్వాన్ని నిలదీశారు. కరెంటు ఎప్పుడు ఉంటుందో.. ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి నెలకొందని విమర్శించారు. వ్యవసాయ రంగానికి నిరంతర విద్యుత్ సరఫరా విషయంలో ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని కోరారు. ఇటీవల విద్యుత్ రంగంపై జరిగిన సమీక్షలో యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌ను దసరాలోపు పూర్తి సామర్థ్యంతో నడిపించేందుకు చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యలు, రైతుల ఇబ్బందులు, ఉద్యోగులు, కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. ప్రజలకు సంబంధించిన కీలక అంశాలపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే బొడిగె శోభ, బీజేపీ రామగుండం ఇంచార్జ్ కందుల సంధ్యారాణి, యాదగిరి సత్తయ్య, భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఆ ఇద్దరు నన్ను అవమానించారు

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** క్షుద్రపూజలు చేశానంటూ కాంగ్రెస్ నాయకులు అసత్య ప్రచారాలు చేస్తూ తన పరువుకు భంగం కలిగిస్తున్నారంటూ మాజీ మంత్రి, బీఆర్ఎస్ నాయకుడు హరీష్ రావు దాఖలు చేసిన పరువు నష్టం దావా కేసుకు సంబంధించి నాంపల్లి కోర్టులో విచారణ ముగిసింది. ఈ కేసుకు సంబంధించి నాంపల్లి ప్రజాప్రతినిధుల కోర్టు న్యాయమూర్తి ఎదుట హరీష్ రావు తన స్టేట్‌మెంట్‌ను రికార్డు చేశారు. విచారణ అనంతరం హరీష్ రావు మాట్లాడుతూ.. కాంగ్రెస్ నాయకుల వైఖరిపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. కాంగ్రెస్ నాయకులు ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని, రాజకీయ లబ్ధి కోసం తనపై నిరాధారమైన అపవాదులు వేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ పాటు ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్‌లు క్షుద్రపూజల అంశంపై అనుచిత వ్యాఖ్యలు చేశారని పేర్కొన్నారు. "రాష్ట్రంలో వర్షాలు పడకుండా నేను క్షుద్రపూజలు చేశానంటూ నాపై నిరాధారమైన అపవాదు వేశారు. కుటుంబసమేతంగా ఆలయానికి వెళ్లి పూజలు చేస్తే, దానిని క్షుద్రపూజలుగా చిత్రీకరించి నా భక్తిని, వ్యక్తిత్వాన్ని హేళన చేశారు" అని ఆయన కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. కాంగ్రెస్ నాయకుల అసత్య వ్యాఖ్యల వల్ల సమాజంలో తనకున్న ప్రతిష్టకు, పరువుకు తీవ్ర భంగం కలిగిందని, అందుకే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని హరీష్ రావు కోర్టును కోరారు.



## 52 కుటుంబాలకు రూ.52.06 లక్షల కళ్యాణ లక్ష్మి సాయం..

**దుమ్ముగూడెం,ఫ్లాష్ ఇండియా :** వివాహం చేసుకున్న 52 మంది అర్హులైన కుటుంబాలకు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకం ద్వారా రూ. 52,06,032 ఆర్థిక సాయం అందింది. ప్రభుత్వం మంజూరు చేసిన ఈ మొత్తానికి సంబంధించిన చెక్కులను భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు బుధవారం దుమ్ముగూడెం తహసీల్దార్ కార్యాలయంలో లబ్ధిదారులకు అందజేశారు. ఒక్కో కుటుంబానికి వివాహ ఖర్చుల్లో కొంత మేర ఆర్థిక భరోసా కల్పించేలా ఈ సాయం అందింది. అదే కార్యక్రమంలో అర్హులైన కుటుంబాలకు స్మార్ట్ రేషన్ కార్డులను కూడా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా అర్హత ఉన్న కుటుంబాలకు అందాల్సిన ప్రయోజనాలు చేరేలా అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి పనిచేయాలని ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు సూచించారు. పథకాలకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకునేలా అవగాహన కల్పించడంతో పాటు, అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందేలా చూడాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తెల్లం హరికృష్ణ, మాజీ జడ్పీటీసీ అన్నె సత్యాలు, జిల్లా ప్రధాన కార్యదర్శి పిలక వెంకటరమణరెడ్డి, జిల్లా కార్యదర్శి లంక అబ్బులు, ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి మోతుకూరి శ్రీకాంత్, నాయకులు మట్టా శివాజీ, పూజారి సూర్యచంద్రరావు, కుంజా శ్రీనివాసరావు, దర్శి సాంబశివరావు, కెల్లా శేఖర్, గడ్డం బాలాజీ, తోట రమేష్, సోడే తిరుపతిరావు, కొమ్ము రంజిత్, జెట్టి రామకృష్ణ, రాయపూడి అనిల్, లంక రాంప్రసాద్, కట్టోజు చంటి, సర్పంచులు మట్టా వెంకటేశ్వరరావు, పొడియం సుబ్బారావు, తునికి జయరావు, కుర్సం రవి, సోడే శ్రీను, తూర్రం నవీన్, పూనెం విజయకుమారి, పర్శిక తులసమ్మ, సరియం రాజమ్మ, కార్యకర్తలు, యూత్ నాయకులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై పార్టీలో చేరిక



**బషీరాబాద్,ఫ్లాష్ ఇండియా :** కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై, గ్రామ అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమనే విశ్వాసంతో బషీరాబాద్ మండలం జీవన్గి గ్రామ సర్పంచ్ రామని బసప్ప కాంగ్రెస్ పార్టీలో చేరారు. తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి సమక్షంలో ఆయన పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి బసప్పకు కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ పార్టీ ఆశయాలకు అనుగుణంగా ప్రజలకు మరింత చేరువగా ఉంటూ, గ్రామ అభివృద్ధికి కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాజవర్ధన్ రెడ్డి, ఏఎంసీ చైర్మన్ శంకరప్ప, సీనియర్ నాయకులు అజయ్ ప్రసాద్, పురుషోత్తం రావు, శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, గ్రామ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సంపాదకీయం



# ఎందుకు పెరుగుతున్నాయి..?

టెక్నాలజీ పెరుగుతున్నకొద్దీ.. సైబర్ నేరాలు కూడా అంతకంతకూ విస్తరిస్తున్నాయి. ఎప్పటికప్పుడు కొత్త పుంతలు తొక్కుతూ.. వేల కోట్ల రూపాయలు స్వాహా చేస్తున్నాయి. ఇప్పటికే దేశంలో నమోదయ్యే ప్రతి నాలుగు కేసుల్లో ఒకటి సైబర్ నేరమే. అలాగే ప్రతి పది మందిలో నలుగురు సైబర్ బాధితులే ఉన్నారంటే.. సైబర్ నేరాలు ఎంతగా చొచ్చుకుపోయాయో అర్థమౌతోంది. ఓవైపు పోలీసులు సైబర్ నేరాల కట్టడికి చర్యలు తీసుకుంటున్నా.. మరోవైపు సైబర్ నేరాలపై అవగాహన కలిగిస్తున్నా కూడా.. నేరాలు పెరగటానికి అత్యాశ, నిర్లక్ష్యమే ప్రధాన కారణాలుగా కనిపిస్తున్నాయి. ఒక్క ప్రాంక్ కాల్.. కోట్ల రూపాయలు ఇచ్చేస్తారు. ఓ అమ్మాయి గొంతు వింటే చాలు.. ఎంత బ్యాక్‌గ్రౌండ్ ఉన్నవారైనా ఐసైపోయి.. ఎన్ని డబ్బులైనా ఇచ్చేస్తున్నారు. సైబర్ నేరాలన్నింటిలో కామన్‌గా కనిపించేది ఒక్కటే. మొదట అత్యాశతో నిర్లక్ష్యంగా వ్యవహరించడం.. ఆ తర్వాత అసలు విషయం తెలుసుకుని లబోదిబోమనటం. మొదట్లో అవగాహన లోపంతో సైబర్ నేరాలు జరిగేవి కానీ.. ప్రస్తుతం మాత్రం చాలావరకు అవగాహన ఉన్నవారే ఈజీగా మోసపోతున్నారు. సైబర్ నేరాల్ని ఇప్పటిదాకా చూసిన కోణానికీ.. ఇకపై చూసే కోణానికీ కచ్చితంగా తేడా ఉంది. ఎందుకంటే మొన్నటిదాకా సైబర్ నేరాల గురించి చాలా మందికి పూర్తి అవగాహన లేదు. కాబట్టి బాధితుల్ని చూసి జాలిపడాల్సి వచ్చేది. కానీ ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారింది. కొంతకాలంగా సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాలు విస్తృతంగా జరుగుతున్నాయి. ప్రభుత్వాలు, ఆర్బీఐ దగ్గర్నుంచీ పోలీసుల దాకా.. లెక్కలేనన్ని అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు. అయితే ఇంత చేస్తున్నా కూడా.. ఉన్నత విద్యావంతులే ఎక్కువగా సైబర్ వలలో చిక్కటం కచ్చితంగా నిర్లక్ష్యమేననే వాదన క్రమంగా బలపడుతోంది. ఓ డాక్టర్ లేడీ వాయిస్ విని ఫ్లాటైపోయి.. ఒకటి కాదు.. రెండు కాదు ఏకంగా రూ.14 కోట్లు పోగొట్టుకున్నారు. తీరా ఆరాతీస్తే.. అసలా లేడీ లేడీనే కాదనే అనుమానాలొస్తున్నాయి. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రాం, టెలిగ్రాంలలో మహిళల ఫేక్ ప్రొఫైళ్లు సృష్టిస్తున్న కేటుగాళు .. ఏఐ సాయంతో ఆకర్షణీయమైన లేడీ వాయిస్‌ను కూడా సృష్టిస్తున్నారు. అంతే మాట్లాడేది ఎవరో.. ఎందుకో కూడా చూసుకోకుండా.. అవతల మహిళ కంఠం వినపడగానే.. టెంప్ట్ అయిపోతున్న బాధితులు.. ఏం చెబితే అది చేస్తూ.. ఎంత అడిగితే అంత ఇచ్చుకుంటున్నారు. అలాగని వీరేం అవగాహన లేని వారు కాదు. మరి ఇలాంటి వారిని చూసి జాలిపడాలా.. ఇంకేం చేయాలి అనేది పోలీసులకూ అంతుచిక్కడం లేదు. అన్నీ తెలిసీ ఇలా ఎందుకు చేశారంటే.. నిజమే అనుకున్నాం అనే రెడీమేడ్ సమాధానం విని.. అధికారులకూ విసుగొస్తోంది. అసలు నమ్మశక్యం గాని లాభాలు, అపరిచిత మహిళల మాటలు ఎలా నమ్ముతారనేది ఏ లాజిక్‌కూ అందని విషయం. సొంత బుర్ర పనిచేయనంతగా.. లేడీస్ వాయిస్ కు టెంప్ట్ అవుతున్నారా అనేది ఆలోచించాల్సిన విషయం. సైబర్ ప్రపంచం రెండు వైపులా పదునున్న కత్తిలాంటిది. సైబర్ నేరగాళ్లు సైబర్ క్షేత్రాన్ని దుర్వినియోగం చేసి ప్రపంచ భద్రతను ప్రమాదంలోకి నెట్టేస్తున్నారు. ఎక్కడో సుదూర ప్రాంతంలో ఉన్న సైబర్ నేరస్తులు మన నెట్టింట్లో ప్రవేశించి మన బ్యాంకు ఖాతాను ఖాళీ చేసేస్తున్నారు. మన ప్రైవసీని దెబ్బ తీస్తున్నారు. కంప్యూటర్ ముందు మీటలు నొక్కుతూ అంతరిక్షంలోని కృత్రిమ ఉపగ్రహాల వ్యవస్థను ఛిద్రం చేసేందుకు వ్యూహాలు రచిస్తున్నారు. ఒక్క బటన్ నొక్కితే శత్రు దేశంలో అణ్వాయుధాలు రీప్రోగ్రామింగ్ జరిగి విధ్వంసం జరిగే ప్రమాదమూ ఉంది. కంప్యూటర్ వ్యవస్థలను విధ్వంసం చేసి అత్యంత సున్నితమైన సమాచారాన్ని తస్కరిస్తున్నారు. సోషల్ నెట్ వర్కింగ్ పేరుతో ఆడవాళ్ల మీద లైంగిక వేధింపులు, ఈవ్ టీజింగ్ తో చెలరేగిపోతున్నారు. భవిష్యత్ లో దేశాల మధ్య యుద్ధాలకు సైబర్ క్షేత్రాలే వేదికలవుతాయనడానికి ఇప్పటికే అనేక ఉదంతాలు వెలుగులోకి వచ్చాయి. సైబర్ నేరాల భవిష్యత్ ముఖచిత్రం ప్రపంచాన్ని భయపెడుతోంది. సైబర్ నేరాలు అధికంగా జరుగుతున్న తొలి 5 దేశాల్లో భారత్ ఒకటని సెక్యూరిటీ సాఫ్ట్ వేర్ సంస్థ సిమాంటిక్ వెల్లడించింది. నేరగాళ్ల నైపుణ్యం పెచ్చుమీరుతోందని రాన్సమ్ వేర్, ఫిషింగ్ ద్వారా అధిక నేరాలకు పాల్పడుతున్నారు. 66 శాతం మంది స్మార్ట్ ఫోన్, నోట్ బుక్ వంటి మొబైల్ పరికరాలను వ్యక్తిగత అవసరాలతో పాటు కార్యాలయ విధులకు వినియోగిస్తున్నారని వెల్లడించిన నివేదిక, దీనివల్ల సైబర్ నేరగాళ్లు సులువుగా సంస్థలకు నష్టం చేకూర్చగలుగుతున్నారని వివరించింది. స్మార్ట్ ఫోన్ వినియోగదారుల్లో 63 మంది ఏదో ఒక రూపంలో సైబర్ నేరస్తుల బారిన పడుతున్నారని తెలిపింది. దేశంలో ఏటా 42 లక్షల సైబర్ నేరాలు నమోదవుతున్నాయి. ప్రతి పది మందిలో నలుగురు సైబర్ నేరాల బారిన పడుతున్నారు. నిమిషానికి 80 మంది ఈ-నేరాల వలలో చిక్కుకుంటున్నారు. వీటివల్ల ప్రపంచ వ్యాప్తంగా జరుగుతున్న నష్టం 11000 కోట్ల డాలర్లు. ఇది వ్యక్తిగత సాయిలో జరుగుతున్న నష్టం మాత్రమే. ఎరవేసి డబ్బు లాగే స్పామ్ దాడుల్లో భారత్ ప్రపంచంలోనే మొదటి స్థానంలో ఉంది. వైరస్ దాడుల్లో రెండో స్థానంలో ఉంది. అన్ని రకాల సైబర్ నేరాల్లో మూడో స్థానంలో ఉంది. దేశంలో ఆన్‌లైన్ లావాదేవీల వ్యాపారమూ శరవేగంగా విస్తరిస్తోంది. అందుకే లాటరీ తగిలిందని తప్పుడు మెయిల్ పంపించి పెద్దఎత్తున డబ్బు కొల్లగొట్టే నైజీరియన్ మోసాల సంఖ్య ఎక్కువవుతోంది. రూ.కోట్ల విలువ చేసే లాటరీ కలిసిందని చెప్పగానే వెనకాముందు ఆలోచించకుండా అడిగినంత డబ్బు మాయగాళ్ల ఖాతాల్లో డిపాజిట్ చేసేవారి సంఖ్యకూ కొదవలేదు. విదేశాల్లో స్థావరాలు ఏర్పాటు చేసుకొని సైబర్ నేరాలకు పాల్పడుతున్న ముఠాలపై అక్కడి ప్రభుత్వాలు ఉక్కుపాదం మోపుతున్నాయి. దీంతో ఇప్పుడు మన పోలీసులకు కొత్త చిక్కులు వచ్చి పడుతున్నాయి. అక్కడ సైబర్ నేరాలకు అలవాటు పడ్డ ముఠాలు ఇటువైపు ఎక్కడ వస్తారో అన్న సందేహమే ఇందుకు కారణం. ఇప్పుడు వీరి చూపు మన దేశంపై పడిందన్న నిఘా వర్గాల సమాచారం అధికారులను ఆందోళనకు గురిచేస్తోంది. కాంబోడియా, మయన్మార్ దేశాలను అడ్డాలుగా చేసుకొని గత కొన్నేళ్లుగా సైబర్ ముఠాలు చెలరేగిపోతున్న సంగతి తెలిసిందే. ప్రపంచ వ్యాప్తంగా ఈ ముఠాలు ప్రజలను దోచుకుంటున్నా.. ఎక్కువగా నష్టపోతుంది భారతీయులే. విదేశాల్లో ఉద్యోగాల కోసం ప్రయత్నిస్తున్న యువకులకు ఎర వేస్తున్న సైబర్ ముఠాలు.. వారికి మాయమాటలు చెప్పి బలవంతంగా వారితో సైబర్ నేరాలు చేయిస్తున్నారు. గతంలో దొంగలు పడితే...ఇళ్లను గుల్ల చేసేవారు. ఒక చోరీ చేయాలంటే పక్కా ప్లాన్ ప్రకారం...కన్నం వేసి ఉన్నదంతా దోచేసేవారు. ఇంట్లో ఉన్న బంగారంతో పాటు డబ్బును ఎత్తుకెళ్లేవారు. దీంతో దొంగల నుంచి డబ్బు, బంగారాన్ని సేఫ్‌గా ఉంచుకునేందుకు...జనం బ్యాంక్‌లవైపు మళ్లారు. బ్యాంక్‌లో అయితే తమ సొమ్ము సేఫ్‌గా ఉంటుందని...అకౌంట్లు తెరిచి ఖాతాల్లో జమ చేసుకుంటున్నారు. గతంలో తమ డబ్బు ఎక్కడికి పోదని...గుండెమీద చేయి వేసుకొని నిద్రపోయేవారు. ప్రస్తుతం టెక్నాలజీ మారిపోయింది. కొత్త కొత్త ఆప్షన్స్ వచ్చాయి. జనం కాలు కదపకుండా అన్ని ఇంటికి వచ్చేస్తున్నాయి. జస్ట్...తమ చేతిలో ఉన్న ఫోన్‌లో యాప్‌ను ఓపెన్ చేసి...ఆర్డర్ పెడితే చాలు...డైపర్ నుంచి హెయిర్ డ్రయ్యర్ దాకా...ఇంటికి డెలివరీ అవుతున్నాయి. కరెంట్ బిల్ కట్టాలన్నా...మున్సిపాల్టీకి ట్యాక్స్‌లు కట్టాలన్నా...ఫోన్ బిల్ కట్టాలన్నా...ఇంకెవరికైనా డబ్బు పంపాలన్నా...బ్యాంక్‌కు వెళ్లి డబ్బు డ్రా చేయాల్సిన అవసరం లేకుండా పోయింది. స్మార్ట్ వర్క్ పెరిగిపోయింది. అన్నింటికి చేతిలో ఉన్న ఫోన్‌నే వాడేస్తున్నారు. జస్ట్ ఒక్క క్లిక్‌తో డబ్బు పంపాల్సిన వారికి పంపుతున్నారు. అంతా టెక్నాలజీ మాయ. స్మార్ట్ నెస్ పెరుగుతున్న కొద్దీ...నేరాలు కూడా అంతే స్మార్ట్‌గా జరుగుతున్నాయి. గతంలో డబ్బు ఇంట్లో పెట్టుకుంటే దొంగలు కొట్టేస్తారన్న భయంతో బ్యాంక్‌ల్లో జమ చేసుకునేవారు. ప్రస్తుతం బ్యాంక్‌లో ఉన్న డబ్బు కూడా సేఫ్ కాదనే రోజులు పోయాయి. టెక్నాలజీ సాయంతో సైబర్ నేరగాళ్లు...స్మార్ట్‌గా...మొబైల్‌కు ఓటీపీ లేదా లింక్ పంపి సొమ్ము కొల్లగొడుతున్నారు. లింక్‌పై క్లిక్ చేసినా...ఓటీపీ చెప్పినా...ఇక అంతే సంగతులు. మీ అకౌంట్లో ఉన్న సొమ్ము క్షణాల్లో ఖాళీ అవుతోంది. ప్రస్తుతం బ్యాంక్ ఖాతా ఉన్న ప్రతి ఒక్కరికి స్మార్ట్ ఫోన్ కూడా ఉంది. ఇదే సైబర్ కేటుగాళ్లకు వరంగా మారుతోంది.

# ఐటీ టు ఆటో డ్రైవర్..



సమాజంలో కొన్ని వృత్తులకు ఒక ప్రత్యేకమైన గౌరవాన్ని, మరికొన్ని వృత్తులకు తక్కువ స్థాయి అనే ముద్రను మనమే వేసుకున్నాం. ముఖ్యంగా ఐటీ ఉద్యోగం అంటే మంచి జీతం, ఏసీ ఆఫీస్, కార్పొరేట్ హోదా, సౌకర్యవంతమైన జీవితం అని భావిస్తాం. అదే ఆటో నడపడం అంటే ఆర్థికంగా వెనుకబడిన వారి జీవనోపాధి అనే అభిప్రాయం కూడా చాలామందిలో ఉంది. కానీ బెంగళూరుకు చెందిన ఓ యువతి కథ ఈ ఆలోచనా విధానాన్నే ప్రశ్నిస్తోంది. ఒకప్పుడు ఐటీ ఉద్యోగం చేసిన ఆమె.. కుటుంబ పరిస్థితులు మారడంతో ఆ ఉద్యోగాన్ని వదిలి ఆటో డ్రైవర్‌గా మారింది. తండ్రి ఆకస్మిక మరణంతో తల్లి ఒంటరిగా మిగలడం, రాత్రి వేళల్లో విధులు నిర్వహించే ఉద్యోగాన్ని కొనసాగించడం కష్టంగా మారడం ఆమె జీవితాన్ని మరో మలుపు తిప్పాయి. కుటుంబానికి అండగా ఉండటంతో పాటు తన జీవనోపాధిని కొనసాగించేందుకు ఆమె కొత్త మార్గాన్ని ఎంచుకుంది. ఆ మార్గం ఆటో డ్రైవింగ్. ఇక్కడ మనం ఆలోచించాల్సిన అసలు విషయం ఆమె ఐటీ ఉద్యోగాన్ని వదిలిందా? ఆటో నడుపుతోందా? అన్నది కాదు. తన జీవిత పరిస్థితులకు అనుగుణంగా తనకు నచ్చిన నిర్ణయం తీసుకునే హక్కు ఆమెకు ఉందా? అన్నదే. సమాజం చాలాసార్లు మన జీవితాలకు ఒక మూసను సిద్ధం చేస్తుంది. చదువుకున్నావంటే ఒక నిర్దిష్టమైన ఉద్యోగం చేయాలి. మంచి జీతం వస్తుంటే దాన్ని వదలకూడదు. మహిళ అయితే మరింత జాగ్రత్తగా వ్యవహరించాలి. ఇతరులు ఏమనుకుంటారో ఆలోచించాలి. కుటుంబం, బంధువులు, సమాజం పెట్టే అంచనాలకు అనుగుణంగా జీవించాలి. ఇలాంటి అనేక కనిపించని గీతలు మహిళల చుట్టూ గీస్తుంటాం. కానీ జీవితం ప్రతి ఒక్కరికీ ఒకే విధంగా ఉండదు. ఆ యువతి ఎదుర్కొన్న పరిస్థితుల్లో రాత్రి వేళల్లో పని చేయలేకపోతే, కుటుంబానికి దగ్గరగా ఉండే మరో వృత్తిని ఎంచుకోవడం తప్పేమీ కాదు. పైగా తన మాటల్లోనే చెప్పినట్లుగా, ఆటో నడపడం ద్వారా ఐటీ ఉద్యోగం కంటే ఎక్కువ ఆదాయం వస్తే, తనకు అనుకూలమైన పని సమయాన్ని తానే నిర్ణయించుకోగలిగితే, ఆ వృత్తిని చిన్నచూపు చూడాల్సిన అవసరం ఏముంది? పని చిన్నది కాదు. దాన్ని చూసే మన దృష్టే చిన్నదిగా ఉండొచ్చు. ఆమెను ఆటో నడుపుతూ చూసిన కొందరు "ఇంత చక్కగా ఇంగ్లీష్ మాట్లాడుతున్నారు.. ఆటో ఎందుకు నడుపుతున్నారు?" అని ఆశ్చర్యపోతున్నారట. ఈ ప్రశ్నలోనే మన సామాజిక ఆలోచనా విధానానికి అద్దం పడుతోంది. ఇంగ్లీష్ మాట్లాడగలిగిన వ్యక్తి ఆటో నడపకూడదా? ఐటీ ఉద్యోగం చేసిన వ్యక్తి చేతితో పనిచేసే వృత్తిని ఎంచుకోకూడదా? విద్యకు, వృత్తికి సంబంధం ఉండకూడదా? నిజానికి విద్య మనకు ఒక ఉద్యోగాన్ని మాత్రమే ఇవ్వదు. ఎలాంటి పరిస్థితుల్లోనైనా నిర్ణయం తీసుకునే ఆత్మవిశ్వాసాన్ని కూడా ఇవ్వాలి. మరో ముఖ్యమైన అంశం మహిళల స్వతంత్రత. పురుషులు సంప్రదాయంగా ఆధిపత్యం వహించే రంగాల్లోకి మహిళలు అడుగుపెడితే ఇప్పటికీ అనేక ప్రశ్నలు ఎదురవుతున్నాయి. "ఇది మహిళలకు సరైన పని కాదు", "జనం ఏమనుకుంటారు?", "ఎందుకు ఇలాంటి పని?" అనే మాటలు వారి ముందుకు వస్తుంటాయి. ఈ మాటలన్నింటినీ ఎదుర్కొంటూ తమకు నచ్చిన జీవితం ఎంచుకోవడం కూడా ఒక రకమైన సామాజిక మార్పే. అయితే ఈ కథను కేవలం "అందరూ ఉద్యోగాలు వదిలి స్వయం ఉపాధి వైపు వెళ్లాలి" అనే సందేశంగా చూడకూడదు. ప్రతి ఒక్కరి పరిస్థితి వేరు. ఐటీ ఉద్యోగం కొందరికి అనుకూలంగా ఉండవచ్చు. ఆటో డ్రైవింగ్ మరొకరికి అనుకూలంగా ఉండవచ్చు. వ్యాపారం ఇంకొకరికి సరైన మార్గం కావచ్చు. వృత్తి గొప్పతనం దాని పేరులో లేదు.. అది మనిషికి అందించే గౌరవం, ఆదాయం, స్వేచ్ఛ, భద్రత, సంతృప్తిలో ఉంటుంది. అలాగే సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఒక వీడియో ఆధారంగా ఒక వ్యక్తి మొత్తం జీవితాన్ని అంచనా వేయడం కూడా సరైంది కాదు. మనకు కనిపిస్తున్నది ఆమె జీవితంలోని ఒక భాగం మాత్రమే. ఆమె ఎదుర్కొన్న పూర్తి ఆర్థిక, కుటుంబ, వ్యక్తిగత పరిస్థితులు మనకు తెలియకపోవచ్చు. కాబట్టి వైరల్ కథనాలను ప్రేరణగా తీసుకోవచ్చు కానీ, వాటి ఆధారంగా సాధారణీకరణలు చేయకూడదు. ఈ కథలో మరో గొప్ప సందేశం ఉంది. కుటుంబ బాధ్యతలు వచ్చినప్పుడు మహిళలు తమ కెరీర్‌ను వదులుకోవాల్సిందే అనే భావన కూడా మారాలి. కుటుంబ బాధ్యత, వృత్తి రెండింటినీ సమన్వయం చేసుకునేందుకు అనువైన అవకాశాలు సమాజంలో మరింత పెరగాలి. ముఖ్యంగా మహిళలకు సురక్షితమైన, సౌకర్యవంతమైన పని వాతావరణం, అనువైన పని సమయాలు, సమాన అవకాశాలు అందుబాటులో ఉండాలి. ఒక మహిళ తనకు నచ్చిన వృత్తిని ఎంచుకున్నప్పుడు మొదటి ప్రశ్న "జనం ఏమంటారు?" కాకుండా "ఆమెకు ఇది సరైనదేనా? ఆమె సురక్షితంగా, గౌరవంగా జీవించగలుగుతోందా?" అనేదై ఉండాలి. ఈ బెంగళూరు యువతి కథ అందుకే కేవలం ఆటో డ్రైవర్ కథ కాదు. అది మన సమాజపు కొలమానాలను ప్రశ్నించే కథ. మనిషి చేతిలో స్టీరింగ్ ఉందా? కంప్యూటర్ ఉందా? ఆఫీసు కుర్చీ ఉందా? అన్నది కాదు ముఖ్యం. తన జీవితానికి సంబంధించిన నిర్ణయాన్ని తానే తీసుకునే స్వేచ్ఛ ఉందా? తన శ్రమకు తగిన గౌరవం, ఆదాయం పొందుతున్నాడా? అన్నదే అసలు విషయం. ఉద్యోగం మనిషికి హోదా ఇవ్వవచ్చు. కానీ ఆత్మగౌరవం మాత్రం మన నిర్ణయాల నుంచే వస్తుంది. ఇతరుల అంచనాలకు తగ్గట్టు జీవించడం కంటే, కుటుంబ బాధ్యతలను గౌరవిస్తూ తనకు సరైన మార్గాన్ని ఎంచుకోవడం కూడా విజయమే. అందుకే ఈ కథ మనకు చెప్పే పెద్ద పాఠం ఒక్కటే-వృత్తిని చూసి మనిషి స్థాయిని నిర్ణయించకండి. ప్రతి శ్రమకు గౌరవం ఇవ్వండి. ముఖ్యంగా మహిళలు తమ జీవితాలపై తీసుకునే నిర్ణయాలను అనుమానించకుండా, గౌరవించడం నేర్చుకోండి. సమాజం మారాలంటే పెద్ద పెద్ద నినాదాలు అవసరం లేదు. మన పక్కనే ఉన్న ఒక ఆటో డ్రైవర్‌ను గౌరవంగా చూడటం మొదలుపెడితే చాలు. అక్కడి నుంచే మార్పు మొదలవుతుంది.

# కొత్త ఇన్‌చార్జి.. కాంగ్రెస్‌కు కొత్త దిశ?

తెలంగాణ కాంగ్రెస్‌లో ఇప్పుడు అందరి చూపు ఏఐసీసీ వైపు మళ్లింది. రాష్ట్ర పార్టీకి కొత్త ఇన్‌చార్జిగా ఎవరిని నియమించబోతున్నారు? దూకుడుగా వ్యవహరించే నాయకుడికి బాధ్యతలు అప్పగిస్తారా? లేక అందరినీ కలుపుకొని వెళ్లే సౌమ్య నాయకత్వాన్ని ఎంపిక చేస్తారా? ఈ ప్రశ్నలు కాంగ్రెస్ అంతర్గత వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. ఇప్పటివరకు రాష్ట్ర వ్యవహారాలను పర్యవేక్షించిన మీనాక్షి నటరాజన్ ఉన్నత విద్య కోసం లండన్ వెళ్లడంతో కొత్త ఇన్‌చార్జి నియామకం అనివార్యమైంది. ఆమె సుమారు పది నెలలపాటు అక్కడే ఉండనున్న నేపథ్యంలో, తెలంగాణ కాంగ్రెస్‌కు కొత్త సమన్వయకర్త అవసరం ఏర్పడింది. కాంగ్రెస్‌లో ఇన్‌చార్జి పదవికి సాధారణ రాజకీయ పదవులకంటే భిన్నమైన ప్రాధాన్యం ఉంటుంది. రాష్ట్రంలో పార్టీ పరిస్థితి, ప్రభుత్వ పనితీరు, నేతల మధ్య సంబంధాలు, కేడర్ సమస్యలు, ఎన్నికల వ్యూహాలు వంటి అంశాలను ఎప్పటికప్పుడు అధిష్టానానికి చేరవేయడంలో ఇన్‌చార్జి కీలక పాత్ర పోషిస్తారు. ముఖ్యంగా అధికారంలో ఉన్న రాష్ట్రంలో పార్టీ--ప్రభుత్వాల మధ్య సమన్వయం సరిగా లేకపోతే దాని ప్రభావం నేరుగా పార్టీ రాజకీయాలపై పడే అవకాశం ఉంటుంది. తెలంగాణలో ప్రస్తుతం ఇదే అంశం ప్రధాన చర్చగా కనిపిస్తోంది. ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నప్పటికీ వాటిని పార్టీ యంత్రాంగం ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ఆశించిన స్థాయిలో చురుకుదనం లేదనే అభిప్రాయాలు పార్టీ వర్గాల్లో ఉన్నాయి. ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలను ముందుగానే పార్టీ వేదికల ద్వారా ప్రజలకు వివరించి, వాటిపై ప్రచార కార్యక్రమాలను రూపొందించాల్సిన అవసరం ఉందనే వాదన కూడా వినిపిస్తోంది. 22ఏ భూముల అంశంలో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడంలో పార్టీ మరింత చొరవ చూపాల్సి ఉండేదనే విమర్శలు ఇందుకు ఉదాహరణగా ప్రస్తావిస్తున్నారు. ఇక్కడే కొత్త ఇన్‌చార్జి పాత్ర కీలకంగా మారుతుంది. ప్రభుత్వం ఒక దిశలో, పార్టీ మరో దిశలో ప్రయాణిస్తే అధికార పార్టీకి రాజకీయంగా ఇబ్బందులు తప్పవు. ప్రభుత్వ నిర్ణయాలకు రాజకీయ వివరణ ఇవ్వడం, వాటి ప్రయోజనాలను కేడర్ ద్వారా ప్రజలకు చేరవేయడం, పార్టీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని పెంచడం వంటి అంశాల్లో సమన్వయం అవసరం. కాబట్టి కొత్త ఇన్‌చార్జి కేవలం ఏఐసీసీ ప్రతినిధిగా కాకుండా పార్టీ--ప్రభుత్వాల మధ్య వారధిగా పనిచేయాల్సిన పరిస్థితి ఉంది. మీనాక్షి



నటరాజన్ వ్యవహారశైలిపై వ్యక్తిగతంగా ఎలాంటి ఆరోపణలు లేవని, ఆమెను సిద్ధాంతపరమైన నిబద్ధత కలిగిన నాయకురాలిగా పార్టీ వర్గాలు అభివర్ణిస్తుంటాయి. అయితే ఆమె కఠినమైన విధానాలు ప్రస్తుత రాజకీయ అవసరాలకు ఎంతవరకు సరిపోతాయనే దానిపై పార్టీలో భిన్నాభిప్రాయాలు ఉన్నట్లు ప్రచారం జరిగింది. అదే సమయంలో ఆమెకు ముందు ఇన్‌చార్జిగా పనిచేసిన దీపాదాస్‌పై ప్రభుత్వ వ్యవహారాల్లో జోక్యం చేసుకున్నారనే విమర్శలు అప్పట్లో వినిపించాయి. అయితే ఇవన్నీ ప్రధానంగా పార్టీ అంతర్గత వర్గాల్లో వ్యక్తమైన అభిప్రాయాలు, విమర్శలుగానే చూడాలి. ఇప్పుడు కాంగ్రెస్ ముందున్న అసలు సవాలు వ్యక్తుల ఎంపిక కంటే వ్యవస్థను సమన్వయం చేయడం. ఇన్‌చార్జి ఎంత దూకుడుగా ఉన్నారన్నది ఒక్కటే ప్రమాణం కాకుండా, రాష్ట్రంలోని విభిన్న వర్గాలను కలుపుకొని వెళ్లగల సామర్థ్యం, ప్రభుత్వం--పార్టీ మధ్య సమన్వయం, కేడర్‌తో నిరంతర సంబంధాలు, ఎన్నికల వ్యూహంపై స్పష్టత వంటి అంశాలు కూడా కీలకం. అధికారంలో ఉన్న పార్టీకి సంస్థాగత బలం ఎంత అవసరమో, ప్రభుత్వ పనితీరును రాజకీయంగా ప్రజల్లోకి తీసుకెళ్లే యంత్రాంగం అంతే అవసరం. వచ్చే అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని కొత్త ఇన్‌చార్జిని ఎంపిక చేయాలని అధిష్టానం భావిస్తున్నట్లు పార్టీ వర్గాల్లో చర్చ సాగుతోంది. మహారాష్ట్రకు చెందిన ముకుల్ వాస్నిక్, తమిళనాడుకు చెందిన డాక్టర్ చెల్లా కుమార్, ఆంధ్రప్రదేశ్ వ్యవహారాలను పర్యవేక్షిస్తున్న పీవీ మోహన్ పేర్లు పరిశీలనలో ఉన్నట్లు సమాచారం. అయితే తుది నిర్ణయం ఏఐసీసీదే. పేర్లపై జరుగుతున్న చర్చలను అధికారిక నిర్ణయంగా పరిగణించాల్సిన అవసరం లేదు. ఇన్‌చార్జి ఎంపికకు మరో రాజకీయ ప్రాధాన్యం కూడా ఉంది. రాష్ట్రంలో త్వరలో జరగబోయే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపికపై కూడా కొత్త ఇన్‌చార్జి ప్రభావం ఉండే అవకాశం ఉందని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. పీసీసీ నుంచి వెళ్లే ఆశావహుల జాబితాపై ఇన్‌చార్జి అభిప్రాయం తీసుకున్న తర్వాతే అధిష్టానం తుది నిర్ణయానికి వచ్చే అవకాశం ఉందనే చర్చ జరుగుతోంది. అంటే కొత్త ఇన్‌చార్జి నియామకం కేవలం పరిపాలనా మార్పు కాదు.. రాబోయే ఎన్నికల రాజకీయాలకు సంబంధించిన కీలకమైన నిర్ణయంగా మారనుంది. కాంగ్రెస్‌కు ఇప్పుడు కావాల్సింది కేవలం ఆదేశాలు ఇచ్చే ఇన్‌చార్జి కాదు. రాష్ట్ర రాజకీయ వాస్తవాలను అర్థం చేసుకొని, పీసీసీ--ప్రభుత్వం--కేడర్ మధ్య సమన్వయం సాధించే నాయకత్వం. వ్యక్తిగత క్రమశిక్షణకు ప్రాధాన్యం ఇస్తూనే రాజకీయ అవసరాలను గుర్తించగలగాలి. ఒకవైపు పార్టీ అంతర్గత విభేదాలను సమన్వయం చేయాలి.. మరోవైపు ప్రభుత్వ నిర్ణయాలకు రాజకీయ బలం చేకూర్చాలి. ముఖ్యంగా ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ పార్టీ యంత్రాంగాన్ని ఒకే దిశలో నడిపించగలగడం అత్యంత అవసరం. అందుకే కొత్త ఇన్‌చార్జి ఎవరు? అనే ప్రశ్న కంటే, ఆయన లేదా ఆమె ఎలాంటి పని తీరుతో పార్టీని నడిపిస్తారు? అన్నదే ఇప్పుడు అసలు ప్రశ్న. తెలంగాణలో అధికారాన్ని నిలబెట్టుకోవాలంటే ప్రభుత్వ కార్యక్రమాలకు ప్రజా మద్దతు పెంచడంతో పాటు పార్టీ సంస్థాగత బలాన్ని కూడా పెంచాల్సి ఉంటుంది. ఈ రెండు అంశాల మధ్య సమన్వయం సాధించగల నాయకత్వాన్ని కాంగ్రెస్ అధిష్టానం ఎంపిక చేస్తుందా? రాబోయే రోజుల్లో ఈ ప్రశ్నకు సమాధానం లభించనుంది.



## గచ్చిబౌలిలో పోలీసులపై ఆర్ఎంపీ దాడి..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలో ఓ ఆర్ఎంపీ డాక్టర్ ఏకంగా పోలీసులపైనే దాడికి పాల్పడి వారిని గాయపరిచాడు. పోలీసులు అరెస్ట్ చేసి తీసుకువెళుతున్నా వారిని తిడుతూ మళ్లీ దాడి చేసేందుకు ప్రయత్నించాడు. ఈ ఘటన మంగళవారం చోటు చేసుకోగా ప్రస్తుతం వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. వివరాల్లోకి వెళితే.. నానక్ రామ్ గూడలోని అపోలో ఆస్పత్రి సమీపంలో గొడవ జరుగుతున్నట్టు పోలీసులకు 112 ద్వారా ఫిర్యాదు అందింది. దీంతో వెంటనే హెడ్ కానిస్టేబుల్ శివకుమార్ ఘటనాస్థలానికి చేరుకున్నారు. కాగా ఆర్ఎంపీ డాక్టర్ సునీల్ కుమార్ వారితో గొడవకు దిగి పోలీస్ సిబ్బంది కాలర్ పట్టుకుని ముఖంపై పిడిగుద్దులు గుద్దాడు. ఘటనలో పోలీస్ సిబ్బందికి గాయాలయ్యాయి. అనంతరం అతడికి సంకెళ్లు వేసి పోలీస్ జీపులో స్టేషన్ కు తరలించారు. స్టేషన్ కు తరలించే క్రమంలోనూ శివకుమార్ పోలీసులను తంతూ వారిపై దాడి చేశాడు. దీంతో కానిస్టేబుల్ శివకుమార్ తీరును వీడియో తీశాడు. దమ్ముంటే బేడీలు తీయాలని, మీ సంగతి చెబుతానని సునీల్ కుమార్ పోలీసులనే హెచ్చరిస్తున్నట్టు వీడియోలో కనిపిస్తోంది. నిందితుడు సునీల్ కుమార్ వరంగల్ పట్టణంలోని ఉషా క్లినిక్ లో ఆర్ఎంపీ డాక్టర్ గా పనిచేస్తున్నట్టు పోలీసులు గుర్తించారు. కేసు నమోదు చేసుకుని విచారణ జరుపుతున్నారు. వీడియో నెట్టింట వైరల్ అవ్వడంతో పోలీసులపైనే దాడికి పాల్పడిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

## సంయుక్త ఆందోళనలకు కార్యాచరణ

**ఢిల్లీ :** భారత ఎన్నికల సంఘం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవ-రణ ప్రక్రియలో భారీగా అవకతవకలు జరిగాయంటూ 'ఇండియా' కూటమి పోరుబాట పట్టింది. దేశవ్యాప్తంగా ఉమ్మడి ఉద్యమాన్ని చేపట్టడంతో పాటు, కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేష్ కుమార్ రాజీనామా డిమాండ్‌ను తీవ్రతరం చేసేందుకు కూటమి అగ్రనేతలు బుధవారం జాతీయ రాజధాని ఢిల్లీలో కీలక భేటీ నిర్వహించారు. కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శులు జైరాం రమేష్, కేసీ వేణుగోపాల్‌తో పాటు పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ (టీఎంసీ), సమాజ్ వాదీ పార్టీ, సీపీఐ, సీపీఎం, ఎన్సీపీ (శరద్ పవార్ వర్గం), శివసేన (యూబీటీ) సహా పలు విపక్ష పార్టీల కీలక నేతలు ఈ ఉన్నత స్థాయి సమావేశానికి హాజరయ్యారు. ఎన్నికల ప్రక్రియ విశ్వసనీయ-ంతను కాపాడేందుకు దేశవ్యాప్తంగా నిరసనలు, ప్రజాక్షేత్రంలో ఉమ్మడి ఆందోళనలు చేపట్టే కార్యాచరణ ప్రణాళికను ఖరారు చేయడంపై విస్తృతంగా చర్చించారు. ఈ సమావేశంలో సీఈసీని లక్ష్యంగా చేసుకుని పార్లమెంటరీ పోరాటానికి దిగేందుకు కూటమి వ్యూహం సిద్ధం చేసినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. చీఫ్ ఎలక్షన్ కమిషనర్ (సీఈసీ) జ్ఞానేష్ కుమార్‌ను పదవి నుంచి తొలగించేందుకు (ఇంపీచ్‌మెంట్) ఉద్దేశించిన ముసాయిదా నోటీసును ఇప్పటికే సిద్ధం చేయగా, దానిని లోక్‌సభ మరియు రాజ్యసభల్లో ప్రవేశపెట్టే ప్రతిపాదనకు ఆమోదం తెలిపే అంశంపై ఈ భేటీలో సమగ్రంగా సమాలోచనలు జరిపారు. రాజ్యాంగబద్ధమైన ఎన్నికల కమిషన్ స్వయంప్రతిపత్తిని దెబ్బతీస్తూ, పారదర్శకత లేకుండా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తూ పార్లమెంట్ ఉభయ సభల్లోనూ ప్రభుత్వాన్ని, ఎన్నికల సంఘాన్ని నిలదీయాలని నేతలు నిర్ణయించారు. తాజా భేటీతో ఎస్ఐఆర్ వివాదం మరియు కేంద్ర ఎన్నికల సంఘం చుట్టూ జాతీయ రాజకీయాలు మరింత వేడెక్కాయి.



## అరేబియా సముద్రంలో కోస్ట్ గార్డ్ భారీ ఆపరేషన్..

## 3 వేల కోట్ల విలువైన డ్రగ్స్ పట్టివేత

**ఢిల్లీ :** అరేబియా సముద్రంలో ఇండియన్ కోస్ట్ గార్డ్ భారీ ఆపరేషన్ జరిపింది. ఈ ఆపరేషన్ లో రికార్డు స్థాయి మాదకద్రవ్యాల ముఠా గుట్టు రట్టయింది. లక్షద్వీప్ దీవులకు సమీపంలోని సముద్ర జలాల్లో అంతర్జాతీయ మార్కెట్‌లో సుమారు 3,000 కోట్ల విలువైన భారీ డ్రగ్స్ కన్సైన్‌మెంట్‌ను అధికారులు విజయవంతంగా పట్టుకున్నారు. నిఘా వర్గాల నుంచి అందిన పక్కా సమాచారంతో రంగంలోకి దిగిన కోస్ట్ గార్డ్ నౌకలు.. అనుమానాస్పదంగా తిరుగుతున్న ఒక ఇరాన్ బోటును సుదీర్ఘంగా వెంబడించి చుట్టుముట్టాయి. ఆ బోటును క్షుణ్ణంగా తనిఖీ చేయగా, నిషేధిత 526 కిలోల హెరాయిన్, మెథాంఫేటమిన్ వంటి ప్రాణాంతక మత్తు పదార్థాలు పట్టుబడ్డాయి. ఆ బోటులో ప్రయాణిస్తున్న ఐదుగురు సిబ్బందిని అదుపులోకి తీసుకోగా, వారంతా పాకిస్థాన్‌కు చెందిన వ్యక్తులుగా అధికారులు నిర్ధారించారు. సముద్ర మార్గం గుండా భారత్‌తో పాటు ఇతర దేశాలకు ఈ భారీ డ్రగ్స్‌ను చేరవేసేందుకు అంతర్జాతీయ స్మగ్లర్లు పన్నిన కుట్రను భద్రతా దళాలు సమర్థవంతంగా భగ్నం

చేశాయి. పట్టుబడిన ఇరాన్ బోటును, ఐదుగురు పాకిస్థానీ నిందితులను తదుపరి విచారణ నిమిత్తం సురక్షిత తీరానికి తరలించారు. ఈ మాదకద్రవ్యాల సరఫరా వెనుక ఉన్న అంతర్జాతీయ స్మగ్లింగ్ ముఠా నెట్‌వర్క్ ఏది, వీటిని ఎక్కడికి చేరవేసేందుకు ప్లాన్ చేశారనే అంశాలపై నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో సహా ఇతర కేంద్ర దర్యాప్తు సంస్థలు లోతైన విచారణ ప్రారంభించాయి. దేశ తీర ప్రాంతాల్లో నిఘాను మరింత కట్టుదిట్టం చేసినట్లు కోస్ట్ గార్డ్ ఉన్నతాధికారులు స్పష్టం చేశారు.

## గాడిద పేరుతో నర్సింగ్ రిజిస్ట్రేషన్



MADHYA PRADESH NURSES REGISTRATION COUNCIL
GOMANTIKA PARISAR, 3RD FLOOR, JAWAHAR CHOWK
BHOPAL, M.P.

CERTIFICATE OF REGISTRATION

This is to certify that Mr. / Miss / Smt. DONKEY MPNRC S/o / D/o / W/o DONKEY FATHER , has undergone the course of B.Sc. Nursing at Bhopal Nursing College, Bhopal Memorial Hospital & Research Centre, Bhopal from 16/07/2021 to 13/08/2025 and has passed the examination conducted by Madhya Pradesh Medical Science University, Jabalpur on August 2025and is admitted to register maintained under the provisions of the Madhya Pradesh Nurses Registration Act,1973 as a "Registered Nurse and Registered Midwife". Registration Number AI-74561,DII-73911 dated 25/09/2026, valid up to 24/09/2031.

पंजीयन प्रमाण पत्र

यह प्रमाणित किया जाता है कि श्री / सुश्री / श्रीमती DONKEY MPNRC पिता / पति / माता का नाम DONKEY FATHER , ने B.Sc. Nursing का प्रशिक्षण Bhopal Nursing College, Bhopal Memorial Hospital & Research Centre, Bhopal में दिनांक 16/07/2021 से 13/08/2025 तक प्रशिक्षण प्राप्त किया है तथा Madhya Pradesh Medical Science University, Jabalpur द्वारा August 2025 में आयोजित परीक्षा उत्तीर्ण की है। मध्य प्रदेश नर्सेस पंजीयन अधिनियम, 1973 के प्रावधानों के अंतर्गत संधारित पंजी में "पंजीकृत नर्स एवं पंजीकृत मिडवाइफ" के रूप में पंजीयन हेतु प्रवेश दिया गया है। पंजीयन क्रमांक AI-74561,DII-73911 दिनांक 25/09/2026 जो कि 24/09/2031 तक वैध है।

**మధ్యప్రదేశ్ :** దేశంలో నర్సింగ్ విద్యా వ్యవస్థకు సంబంధించి మరో సంచలన వివాదం తెరపైకి వచ్చింది. ఏకంగా ఓ గాడిద పేరు మీద ఆన్‌లైన్ ద్వారా నర్సింగ్ రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్ జారీ చేసిన ఘటన మధ్యప్రదేశ్ రాష్ట్రంలో కలకలం రేపుతోంది. కౌన్సిల్ ఆన్‌లైన్ పోర్టల్‌లో ఎలాంటి సరైన పత్రాలు, వెరిఫికేషన్ లేకుండానే రిజిస్ట్రేషన్లు జరుగుతున్న తీరు పట్ల సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

**ఎన్ఎస్‌యూఐ నేత ప్రయోగం..**

మధ్యప్రదేశ్ నర్సెస్ రిజిస్ట్రేషన్ కౌన్సిల్ ఆన్‌లైన్ పోర్టల్ పనితీరును, ధ్రువపత్రాల పరిశీలన విధానాన్ని పరీక్షించేందుకు ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రవి పర్మార్ ఓ సరికొత్త ప్రయోగం చేశారు. ఇందులో భాగంగా ఆయన కౌన్సిల్ ఆన్‌లైన్ పోర్టల్‌లో ఓ గాడిద ఫోటోను అప్‌లోడ్ చేశారు. అంతేకాకుండా, ఎలాంటి సరైన నర్సింగ్ విద్యార్హత పత్రాలు లేని నకిలీ పత్రాలను సమర్పించారు. దరఖాస్తులో అభ్యర్థి తండ్రి పేరు స్థానంలో గాడిద తండ్రి అని నమోదు చేశారు. నిర్దేశిత ఫీజు చెల్లించిన తర్వాత, కౌన్సిల్ ఆన్‌లైన్ సిస్టమ్ ఎలాంటి వెరిఫికేషన్ చేయకుండానే ఆ గాడిద పేరు మీద ప్రొవిజనల్ నర్సింగ్ రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్‌ను ఆటోమేటిక్‌గా జారీ చేసింది.

**స్పందించిన కౌన్సిల్, రిజిస్ట్రేషన్ల నిలిపివేత**

అయితే, విషయం కాస్త సోషల్ మీడియాలో వైరల్ అవ్వడంతో ఈ అంశంపై మధ్యప్రదేశ్ నర్సెస్ రిజిస్ట్రేషన్ కౌన్సిల్ స్పందించింది. కౌన్సిల్ ప్రెసిడెంట్ డాక్టర్ వేణు కుష్వాహా మాట్లాడుతూ.. ఇది ప్రొవిజనల్ జిస్ట్రేషన్ మాత్రమేనని, తదుపరి వెరిఫికేషన్ జరుగుతుందని తెలిపారు. ఫేక్ సర్టిఫికెట్లు సమర్పించి ఇలాంటి చర్యలకు పాల్పడటం చట్టరీత్యా నేరమని పేర్కొన్నారు. అయినప్పటికీ, ఈ ఉదంతం నేపథ్యంలో అదనపు సిస్టమ్ చెక్స్ అమలు చేసే వరకు రిజిస్ట్రేషన్ ప్రక్రియను తాత్కాలికంగా నిలిపివేసినట్లుగా వెల్లడించారు.

## డబ్బులు ఇస్తే సై, లేదంటే ఫిర్యాదు!

### సమాచార హక్కు చట్టం పేరుతో నయా దందా...

**రాయికల్,ఫ్లాష్ ఇండియా :** సమాచార హక్కు చట్టాన్ని ఆయుధంగా చేసుకుని, ఎస్సీ ఎస్టీ కేసుల పేరుతో బెదిరింపులకు పాల్పడుతూ ఓ వ్యక్తి రాయికల్ మండలంలో నయా దందాకు తెరలేపాడు. ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని వేదికగా చేసుకుని ఇష్టారాజ్యంగా ఫిర్యాదులు చేయడం, ఆపై సదరు వ్యక్తులను భయభ్రాంతులకు గురిచేసి అక్రమ వసూళ్లకు పాల్పడటం ఇతని నైజంగా మారింది. రాయికల్ మండలంలోని ధనవంతులు, సామాన్యులను టార్గెట్ చేస్తూ "డబ్బులు ఇస్తే సై.. లేదంటే ఫిర్యాదు" అంటూ ఇబ్బందులకు గురిచేస్తున్న అధికారులు పట్టించుకోకపోవడం పై స్థానికులు మండిపడుతున్నారు.

**జైలుకు వెళ్లినా మారని తీరు..**

గతంలో సదరు వ్యక్తి ఇదే తరహాలో కలెక్టరేట్‌లో అడ్డగోలు ఫిర్యాదులు చేస్తూ, కొందరు డబ్బులు ఇవ్వకపోవడంతో వారిపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడ్డాడు. ఈ క్రమంలోనే సుపారీ వసూళ్ల కేసులో పోలీసులకు దొరికి జైలుకు కూడా వెళ్లాడు. జైలు నుంచి వచ్చిన తర్వాత అప్పటి పోలీస్ ఉన్నతాధికారుల కఠిన నిఘాతో కొంతకాలం అణిగిమణిగి ఉన్నప్పటికీ, ఇటీవల సదరు అధికారులు బదిలీ కావడంతో మళ్లీ పాత దందాను మొదలుపెట్టాడు. పట్టణంలోని గాంధీ చౌక్‌ను అడ్డాగా మార్చుకుని.. కోర్టు వివాదాల్లో ఉన్న సివిల్, క్రిమినల్ కేసుల్లో జోక్యం చేసుకుంటూ, బహిరంగంగానే బూతులు తిడుతూ రాజ్యాంగ చట్టం లోని లొసుగులను అడ్డం పెట్టుకుని అక్రమంగా సంపాదిస్తున్నాడని ప్రజలు చర్చించుకుంటున్నారు. ఎవరైనా ఎదురు తిరిగితే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు పెడతానని బెదిరించడం ఇతనికి నిత్యకృత్యంగా మారింది.

**గ్రామ ప్రజల తిరుగుబాటు.. మున్సిపాలిటీలో పాగా:**

ఈ వ్యక్తి వేధింపులు భరించలేక అతని సొంత గ్రామంలోని సర్పంచ్, ఉప సర్పంచ్, గ్రామ-స్థులంతా ఏకమై సదరు వ్యక్తిని గట్టిగా మందలించారు. గ్రామానికి చెందిన పలువురిపై పెట్టిన తప్పుడు ఎస్సీ, ఎస్టీ కేసులను సైతం వెనక్కి తీసుకోక తప్పలేదు. సొంత ఊరిలో పప్పులు ఉడకకపోవడంతో, పక్కనే ఉన్న మున్సిపాలిటీ పరిధిలోకి తన అడ్డాను మార్చాడు. అక్కడ సామాన్య, మధ్యతరగతి ప్రజలు తమ స్తోమతకు తగినట్లుగా నిర్మించుకుంటున్న గృహ నిర్మాణ పనుల వద్దకు వెళ్లి అడ్డంకులు సృష్టిస్తున్నాడు. అడిగినంత ఇచ్చుకోకపోతే వెంటనే మున్సిపల్, మండల పరిషత్, జిల్లా కలెక్టర్ కార్యాలయాల్లో తప్పుడు ఫిర్యాదులు చేస్తూ నిర్మాణదారులను మానసిక క్షోభకు గురి చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం.

**భూమి పట్టా చేయిస్తానని రూ. 60 వేల వసూలు.. తిరగబడితే కేసుల బెదిరింపు:**

ఇటిక్యాల గ్రామానికి చెందిన ఓ అమాయక రైతు వద్ద మూడేళ్ల క్రితం "భూమి పట్టా మార్పిడి చేయిస్తా" అని నమ్మబలికి రూ. 60 వేలు వసూలు చేశాడు. ఎంతకాలమైనా పట్టా కాకపోవడంతో సదరు రైతు తన డబ్బులు తిరిగి ఇవ్వాలని నిలదీశాడు. దీంతో ఆగ్రహానికి గురైన ఆ కేటుగాడు.. "మళ్లీ డబ్బులు అడిగితే నీపై ఎస్సీ, ఎస్టీ కేసు పెట్టి జైలుకు పంపిస్తా" అని బెదిరింపులకు దిగాడు. భయపడిపోయిన సదరు రైతు అతని కాళ్లు వేళ్లు పడి, కేసు పెట్టకుండా ఉండటం కోసం మరో రూ. 15 వేలు ఇచ్చుకోవాల్సి వచ్చిందని తన బంధువుల వద్ద కన్నీరు పెట్టుకున్నాడు. చట్టం లోని లొసుగులను అడ్డం పెట్టుకుని సామాన్యులను పీడిస్తున్న ఈ సుపారీ బ్లాక్‌మెయిలర్‌పై ఉన్నతాధికారులు, పోలీసులు స్పందించి తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని రాయికల్ మండల ప్రజలు కోరుతున్నారు.

## పేద విద్యార్థులకు బడిబాట



**షాద్ నగర్,ఫ్లాష్ ఇండియా :** విద్యకు దూ-రమైన పేద విద్యార్థులను గుర్తించి వారిని బడిబాట పట్టించేందుకు ఫరూఖ్ నగర్ విద్యాశాఖ అధికారులు సిండికేట్ కాలనీలో ప్రత్యేక చర్యలు చేపట్టారు. హాజీపల్లి శివారులోని సిండికేట్ కాలనీలో పాఠశాల భవన నిర్మాణ పనులను బుధవారం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యతోనే సామాజిక, ఆర్థిక అసమానతలను అధిగమించి సమసమాజ నిర్మాణం సాధ్యమవుతుందని అన్నారు. కాలనీలో విద్యకు దూరమైన విద్యార్థులను గుర్తించేందుకు విద్యాశాఖ ప్రత్యేక సర్వే నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. పేద విద్యార్థులకు పుస్తకాలు, దుస్తులు, బ్యాగులు, భోజన వసతి తదితర సాయాన్ని అందిస్తామని తెలిపారు. పా-ఠశాల భవన నిర్మాణం, విద్యార్థులకు అందించేందుకు బ్యాగులు, పుస్తకాలు, దు-స్తుల కోసం ఇప్పటికే సుమారు 50 మంది దాతలు రూ.5 వేల నుంచి రూ.5 లక్షల వరకు విరాళాలు అందించారని తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని పిల్లలను ఉన్నత విద్య అందించేందుకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అగ్గనూరి బసవేశ్వర్, వైస్ చైర్మన్ అంతే మోహన్, ఎంఈఓ మనోహర్, గ్రామ సర్పంచ్ కుమార్, కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

## సీఎంకు హరీశ్ రావు లేఖ

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** సింగరేణి విద్యుత్‌ను రాజస్థాన్‌కు ధారాదత్తం చేయడం ప్రజాద్రోహమేనని మాజీ మంత్రి హరీశ్ రావు విమర్శించారు. మన రాష్ట్రంలో తక్కువ ఖర-్చుతో ఉత్పత్తయ్యే విద్యుత్‌ను ఇతర రాష్ట్రాలకు ధారాదత్తం చేయడం ప్రజా వ్యతిరేక చర్య కాక మరేమిటి? అని సీఎం రేవంత్ రెడ్డిని ప్రశ్నించారు. బొగ్గు మనది, నీళ్లు మనవి, స్థలం మనది.. కానీ మంచిర్యాల్ జైపూర్ (సింగరేణి)లో తయారయ్యే 800 మెగావాట్ల కరెంటు మాత్రం రాజస్థాన్‌కా అని నిలదీశా-రు. తల్లికి అన్నం పెట్టనోడు పినతల్లికి బంగారు గాజులు కొనిచ్చినట్టు.. సొంత రాష్ట్రంలో కరెంటు ఇవ్వలేక రాజస్థాన్‌కు విద్యుత్‌ను కట్టబెడుతున్నారని మండిపడ్డారు. సింగరేణి (జైపూర్) కరెంటును రాజస్థాన్‌కు కట్టబెట్టే జాయింట్ వెంచర్ ఒప్పందాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తూ ఇవాళ సీఎం రేవంత్ రెడ్డికి హరీశ్ రావు బహిరంగ లేఖ రాశారు. సొంత రాష్ట్రంలో రైతులు కరెంటు లేక ఇబ్బందులు పడుతుంటే ఇతర రాష్ట్రాలకు కరెంటును ఎలా ధారాదత్తం చేస్తారని ఆయన ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.

**మీ వైఫల్యాన్ని ఎల్‌నినో మీదకు వద్దు:**

తెలంగాణ ప్రజల ఆస్తి అయిన సింగరేణి నుంచి దాదాపు 22 వేల కోట్ల పెట్టుబడిని రాజస్థాన్ అభివృద్ధికి ఎందుకు మళ్లించాలి? రైతులకు 24 గంటల విద్యుత్ ఇస్తున్నామని చెప్పి కనీసం 7-8 గంటలు కూడా ఇవ్వలేకపోవడం కాంగ్రెస్ ప్రభుత్వ చేతకానితనం అని లేఖలో పేర్కొన్నారు. విద్యుత్ కోతలతో పవర్ హాలిడేలు ప్రకటిస్తూ.. మీ పాలనా వైఫల్యాన్ని ఎల్‌నినో మీదకు నెట్టి తప్పించుకుంటారా? అని నిలదీశారు. మీ నిర్వహణ లోపం వల్లే కేసీఆర్ ఎంతో ముందుచూపుతో నిర్మించిన విద్యుత్ కేంద్రాలు నేడు కునారిల్లుతున్నాయన్నారు. యాదాద్రి ప్లాంటుకు జీ10, జీ11 గ్రేడ్ బొగ్గు వాడాలి..



కానీ నాసిరకం జీ13, జీ14 బొగ్గు వాడి బాయిలర్లు దెబ్బతినేలా చేస్తున్నారని, కృతిమ బొగ్గు కొరత సృష్టించి కొత్తగూడెం 800 MW, భద్రాద్రి 540 MW కేంద్రాల్లో విద్యుత్ ఉత్పత్తి పూర్తిగా నిలిపేశారని ధ్వజమెత్తారు.

**ఒప్పందం రద్దు చేసుకోండి:**

థర్మల్ కేంద్రాల్లో 45 రోజులకు సరిపడా బొగ్గు నిల్వలు కాదు కదా, కనీస నిల్వలు కూడా లేకుండా తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నారని వాస్తవాలను క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు బీఆర్ఎస్ పార్టీ వెళ్తే, పోలీసులను పెట్టి అడ్డుకోవడం మీ నియంతృత్వానికి నిదర్శనం అన్నారు. రాష్ట్రానికి ఎలాంటి అదనపు భారం లేకుండా ఎన్‌టీపీసీ ఇచ్చే 1600 మెగావాట్ల కరెంటును వద్దు అని చెప్పడానికి మీరెవరు? రాష్ట్ర విభజన హామీ ప్రకారం ఎన్టీపీసీ నుంచి తెలంగాణకు రావాల్సిన విద్యుత్ కోసం తక్షణమే పీపీఏ ఒప్పందం చేసుకోవాలన్నారు. రాజస్థాన్ విద్యుత్ ఒప్పందాన్ని తక్షణమే రద్దు చేసుకోకపోతే.. రైతుల పక్షాన బీఆర్ఎస్ పార్టీ తీవ్ర పోరాటం చేస్తుందని హెచ్చరించారు.

## 4 ఏళ్లుగా తండ్రి మృతదేహాన్ని...

**ముంబయి :** భవిష్యత్‌లో వైద్య సాంకేతికత పెరిగి చనిపోయిన వ్యక్తులను మళ్లీ బతికించుకునే అవకాశం వస్తుందనే గుడ్డి నమ్మకంతో ఓ మహిళ చనిపోయిన తండ్రి మృతదేహాన్ని నాలుగేళ్లుగా రహస్యంగా భద్రపరిచిన విషయం బట్టబయలైంది. పోలీసులు తెలిపిపిన వివరాల ప్రకారం ముంబయిలోని మలాడ్ ప్రాంతంలో ఉన్న ఓ భవనం బయట కొన్నేళ్లుగా త్వరలో డేకేర్ సెంటర్ ప్రారంభం అనే సైన్ బోర్డు వేలాడుతూ ఉంది. అయితే ఆ భవనం గేటుకు మాత్రం తాళం వేసి ఉంది. ఇటీవల విపరీతమైన దుర్వాసన రావడంతో స్థానికులు ఇచ్చిన ఫిర్యాదుతో ఆ స్థలానికి చేరుకున్న పోలీసులు తాళాలు పగలగొట్టి ఇంట్లోకి ప్రవేశించారు. ఫ్రీజర్‌లో ఓ మృతదేహం భద్రపరిచి ఉండడం చూసి దిగ్భ్రాంతికి గురయ్యారు. మృతుడి కుమార్తె అంధేరి ప్రాంతంలో నివసిస్తున్నట్లు స్థానికులు తెలిపారు. అప్పుడప్పుడు ఆమె ఈ ఇంటికి వచ్చి వెళ్తుందని పేర్కొన్నారు.

**నెలకు రూ.1.6 లక్షల ఖర్చు:**

ఈ ఘటనపై సదరు మహిళన ప్రశ్నించిన పోలీసులకు విస్తుపోయే విషాలు తెలిశాయి. తన తండ్రి క్యాన్సర్‌తో బాధపడుతూ జూన్ 2022లో మరణించాడని పోలీసులకు ఆ మహిళా తెలిపింది. తన తండ్రిపై ప్రేమతో మృతదేహాన్ని తమ కుటుంబం భద్రపరుచుకోవాలని భావించినట్లు తెలిపింది. మృతదేహాన్ని సుదీర్ఘకాలం భద్రపరిచే మార్గాల కోసం ఇంటర్నెట్‌లో వెతికామని ఈ క్రమంలో అమెరికాలోని 'క్రయోనిక్స్' (జతీఎశీఅఱఎం) విధానం గురించి తెలుసుకుని ఒక సంస్థను సైతం సంప్రదించామని చెప్పింది. మృతదేహాన్ని అమెరికాకు తరలించడానికి డబ్బు ఆదా చేస్తున్నామని అప్పటి వరకు తాత్కాలికంగా స్థానిక క్లినిక్‌లోని ఫ్రీజర్‌లో ఉంచామని తెలిపారు. టెంపరరీగా మృతదేహాన్ని భద్రపరచడానికి డేకేర్ సెంటర్ నిర్వాహకులకు నెలకు సుమారు రూ.1.60 లక్షలు చెల్లిస్తూ చెల్లిస్తున్నట్లు వెల్లడించింది. ప్రస్తుతం పోలీసులు



మృతదేహం ఏ స్థితిలో ఉంది, దానిని ఏ పద్ధతిలో భద్రపరిచారనే విషయాలను తెలుసుకునేందుకు ముంబయిలోని నిపుణులైన వైద్యుల సలహాలను తీసుకుంటున్నారు. మ-రోవైపు ఈ కేసులో తన వైపు వాదనలు వినిపించేందుకు ఆ మహిళ న్యాయవాదులను నియమించుకుంది. ఈ వ్యవహారంలో చట్టపరమైన నిబంధనల ఉల్లంఘన ఏమైనా జరిగిందా అనే కోణంలో కురార్ పోలీసులు పూర్తిస్థాయి దర్యాప్తు జరుపుతున్నారు.

**చట్టం ఏం చెబుతోంది?:**

భారతదేశంలో మానవ మృతదేహాలను భద్రపరచడం, క్రయోనిక్స్ (మృతదేహాలను అత్యల్ప ఉష్ణోగ్రతల వద్ద ఉంచడం) విధానం లేదా ఫ్రీజర్‌లో సుదీర్ఘకాలం ఉంచడానికి సంబంధించి ప్రత్యేకంగా ఒక నిర్దిష్టమైన చట్టం లేదు. అయితే ఒక మృతదేహాన్ని ఇలా భద్రపరచడం అనేది రాజ్యాంగ హక్కులు, క్రిమినల్ చట్టాలు, ఆరోగ్య నిబంధనలతో ముడిపడి ఉందని న్యాయనిపుణులు చెబుతున్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ప్రకారం లభించే జీవించే హక్కు ఆత్మగౌరవం మరణించిన వ్యక్తికి కూడా వర్తిస్తుందని సుప్రీంకోర్టు తీర్పులు చెబుతున్నాయి. ప్రతి వ్యక్తికి వారి మతపరమైన, సాంప్రదాయ విశ్వాసాల ప్రకారం గౌరవప్రదంగా అంత్యక్రియలు (దహనం లేదా ఖననం) పొందే హక్కు ఉంది. స్పష్టమైన చట్టపరమైన లేదా మతపరమైన కారణం లేకుండా సుదీర్ఘకాలం శరీరాలను ఫ్రీజర్‌లో ఉంచడం ఈ హక్కును కాలరాయడమే అవుతుంది. స్థానిక పోలీసులకు, ఆరోగ్య శాఖ అధికారులకు సమాచారం ఇవ్వకుండా ఇంట్లో లేదా ప్రైవేట్ ప్రదేశాలలో రహస్యంగా మృతదేహాలను దాచడం చట్టరీత్యా నేరంగా పరిగణించబడుతుంది. హత్య, అనుమానాస్పద మృతి లేదా మరేదైనా నేరాన్ని కప్పిపుచ్చేందుకు మృతదేహాన్ని దాచిపెడితే కఠిన శిక్షలు ఉంటాయి. భారతీయ నగరాల సురక్షిత చట్టాల ప్రకారం మృతదేహానికి భంగం కలిగించడం లేదా అవమానపరిచే రీతిలో ప్రవర్తించడం నేరంగా పరిగణిస్తారు.

**ఫ్రీజర్ భద్రతపై గత న్యాయస్థానాల తీర్పులు:**

దివ్య జ్యోతి జాగ్రతి సంస్థాన్‌కు చెందిన ఆధ్యాత్మిక గురు అశుతోష్ మహారాజ్ క్లినికల్‌గా మరణించినప్పుడు (2014), ఆయన సమాధి (ధ్యానం)లో ఉన్నారని నమ్ముతూ అనుచరులు ఆయన దేహాన్ని ఫ్రీజర్‌లో భద్రపరిచారు. పంజాబ్ & హర్యానా హైకోర్టు వారి మత విశ్వాసాలను పరిగణనలోకి తీసుకుని, ప్రజారోగ్యానికి భంగం కలగకుండా ఉంచడానికి అనుమతించింది. కోర్టు ఆదేశాల ప్రకారం నిపుణులైన ప్రభుత్వ వైద్య బృందం ఇప్పటికీ ప్రతి ఆరు నెలలకు ఒకసారి ఈ మృతదేహాన్ని పరీక్షిస్తూ ఉంటుంది. దాదాపు 12 సంవత్సరాలు గడుస్తున్నా, మృతదేహం ఎటువంటి నశించిపోయే సంకేతాలు లేకుండా 99 శాతం భద్రంగానే ఉన్నట్లు వైద్య నివేదికలు పేర్కొంటున్నాయి. ప్రస్తుతం ఆశ్రమంలో ఆయన ఒక నిలువెత్తు కటౌట్‌ను ప్రధాన కుర్చీలో ఉంచి, ఆయనే ఇప్పటికీ సంస్థాన్‌కు అధిపతిగా వ్యవహరిస్తున్నట్లుగా సెక్ట్ కార్యకలాపాలు సాగిస్తున్నారు.

# కుల వివక్షకు తావులేకుండా ఐక్యంగా ముందుకు సాగాలి




**పెద్దపల్లి, ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** ఎలిగేడు మండలం ర్యాకల్ దేవ్ పల్లి గ్రామంలో బుధవారం పౌర హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో పౌర హక్కులు, సామాజిక సమానత్వం, కుల వివక్ష నిర్మూలనపై ప్రజలకు అవగాహన కల్పించారు.కార్యక్రమంలో ఎలిగేడు తహసీల్దార్ యాకన్న మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ కుల, మత, వర్గ భేదాలకు అతీతంగా పరస్పరం గౌరవించుకుంటూ కలిసి మెలిసి జీవించాలని సూచించారు. గ్రామంలో ఎలాంటి కుల వివక్షకు తావులేకుండా అందరూ ఐక్యతతో ముందుకు సాగాలని అన్నారు. గ్రామ అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, సమాజంలో సమానత్వం, సోదరభావం పెంపొందించేందుకు కృషి చేయాలని పేర్కొన్నారు.ప్రతి పౌరుడికి రాజ్యాంగం కల్పించిన హక్కులను గౌరవిస్తూ, ఇతరుల హక్కులకు భంగం కలగకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని తహసీల్దార్ సూచించారు. గ్రామంలో ప్రజల మధ్య సఖ్యత, సామరస్యం కొనసాగితేనే సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు.కార్యక్రమంలో తాసిల్దార్ యాకన్న,ఎంపీడీవో భాస్కరరావు, ఆర్ ఐ చంద్రశేఖర్, ఏఎస్ఐ శ్రావణ్ కుమార్ గ్రామ సర్పంచ్ రమాదేవి, ఉపసర్పంచ్ శివకృష్ణ ,జిపిఓ షఫీ,అంబేద్కర్ సంఘం నాయకులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సేవలో హన్మయ్యకు ప్రత్యేక స్థానం



**పెద్దపల్లి ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** స్వాతంత్ర్య సమరయోధుడు వెంగళ హన్మయ్య ప్రజా సేవకు అంకితమై పనిచేసిన మహనీయుడని ఎలిగేడు సర్పంచ్ కప్పల ప్రవీణ్ అన్నారు. హన్మయ్య 17వ వర్ధంతిని పురస్కరించుకుని బుధవారం గ్రామపంచాయతీ కార్యాలయంలో స్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.సర్పంచ్ ప్రవీణ్ మాట్లాడుతూ.. గ్రామ ప్రజల సంక్షేమమే ధ్యేయంగా హన్మయ్య పనిచేశారని తెలిపారు. ఆయన హయాంలో ఎలిగేడు గ్రామంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు ప్రత్యేక గుర్తింపు తెచ్చాయని పేర్కొన్నారు. గ్రామాభివృద్ధికి ఆయన అందించిన సేవలను ఎలిగేడు ప్రజలు ఎప్పటికీ గుర్తుంచుకుంటారని అన్నారు. హన్మయ్య జీవితాన్ని, ప్రజాసేవా విధానాన్ని నేటి తరం యువత స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నర్సాపూర్ సర్పంచ్ పల్లెర్ల వెంకటేష్‌గౌడ్, రాములపల్లి సర్పంచ్ సిద్ధి తిరుపతి యాదవ్, ఎలిగేడు ఉపసర్పంచ్, ముంజం నరేష్‌కుమార్, మాజీ ఉపసర్పంచ్ గుడుగుల మహేందర్, వార్డు సభ్యులు మామిడాల రమేష్, మడుపు నరేందర్, కవిత రాకేష్, మాజీ వార్డు సభ్యుడు తాటిపల్లి సతీష్‌బాబు, నాయకులు కట్ల ప్రకాష్, కవ్వంపల్లి శ్రీను, గుడుగుల రాజు, కోడూరు భూమయ్య, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# జాతీయస్థాయి పోటీలకు 13 మంది క్రీడాకారుల ఎంపిక



**మిర్యాలగూడ ఫ్లాష్ ఇండియా ప్రతినిధి:** నల్లగొండ జిల్లాలో నిర్వహించిన నేషనల్ ఇంటర్ డిస్ట్రిక్ట్ జూనియర్ అథ్లెటిక్స్ మీట్ (ఎన్ ఐ డి జే ఏ ఎం)లో సుమారు 180 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. బుధవారం నిర్వహించిన ఈ జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీలను ఏరియా కార్పొరేటర్ అల్లి సుభాష్ యాదవ్,జిల్లా యువజన క్రీడల అధికారి (డి వై ఎస్ ఓ) అక్బర్ అలీ ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు.జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారుల నుంచి 13 మందిని జాతీయస్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నారు.ఎంపికైన క్రీడాకారులు సంగారెడ్డి జిల్లాలో నవంబర్ 13,14,15 తేదీల్లో నిర్వహించనున్న జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటారు.జిల్లా స్థాయి పోటీల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు ముఖ్య అతిథుల చేతుల మీదుగా మెడల్స్,సర్టిఫికెట్లు అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడాకారులు జాతీయస్థాయి పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి పతకాలు సాధించాలని ఆకాంక్షించారు.నల్లగొండ జిల్లాతో పాటు రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని వారు సూచించారు.యువత చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో నల్లగొండ జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ అధ్యక్షుడు మాచర్ల జగ్జీవన్, ప్రధాన కార్యదర్శి శంభులింగం, కోశాధికారి పవన్ కుమార్, గౌరవ అధ్యక్షుడు నాగరాజు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థినులు క్రమశిక్షణతో బాగా చదువుకోవాలి

**ధర్మసాగర్,ఫ్లాష్ ఇండియా :** విద్యార్థినులు క్రమశిక్షణతో బాగా చదువుకోవాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అన్నారు. హనుమకొండ జిల్లా వేలేరంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం ( కేజీబీవీ)ని జిల్లా కలెక్టర్ సందర్శించారు. పాఠశాలలో ఏవైనా ఇబ్బందులున్నాయా అని కలెక్టర్ ఉపాధ్యాయులు, విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. ఆర్వో వాటర్ ప్లాంట్ ను పరిశీలించి టైం ప్రకారం గా క్లీన్ చేయించాలన్నారు. మెనూ ప్రకారం కూరగాయలు, నిత్యావసర సరకులు వస్తున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. తరగతి గదుల్లోని అన్ని ఫ్యాన్లు పనిచేస్తున్నాయా అని ఆరా తీశారు. డార్మెటరీ రూమ్ కు వెళ్లి అక్కడ పరిస్థితులను పరిశీలించారు. ఒక్కో డార్మెటరీలో ఎంతమంది ఉంటున్నారని అడిగారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ... విద్యార్థినులు ఉన్నత స్థానానికి చేరుకుని సొంత గ్రామాలకు సేవలందించాలన్నారు. డార్మెట్రీలలోకి దోమలు రాకుండా అన్నీ రూమ్ లకి మెష్ ఉండాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖ అధికారి ఎల్. వి.గిరిరాజు గౌడ్, తహసీల్దార్ కోమి, జిసిడివో సునీత,ఎంపీడీవో కిషన్,ఎంఈఓ చంద్రమౌళి, కేజీబీవీ ప్రత్యేక అధికారి స్రవంతి, ఇతర అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



# పొలగోని రాములమ్మ మృతి బాధాకరం

**చింతపల్లి మండలం/తీదేడు, ఫ్లాష్ ఇండియా ప్రతినిధి:** తీదేడు గ్రామానికి చెందిన పొలగోని రాములమ్మ మృతి బాధాకరమని బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు కంకణాల వెంకట్ రెడ్డి అన్నారు.బుధవారం తీదేడు గ్రామంలో నిర్వహించిన రాములమ్మ దశదిన కర్మ కార్యక్రమానికి కంకణాల వెంకట్ రెడ్డి హాజరై, ఆమె చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. రాములమ్మ ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు మనోధైర్యం ప్రసాదించాలని ప్రార్థించారు.ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు పొలగోని కృష్ణయ్య గౌడ్, పొలగోని నర్సింహా, ఉలుపాల శేఖర్ రెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షులు సోనగంటి గోవర్ధనాచారి, పీఏసీఎస్ డైరెక్టర్ తిరుమణి పాపయ్య, బీఆర్ఎస్ నాయకులు ఉలుపాల పురుషోత్తం రెడ్డి, సిమర్ల శ్రీను యాదవ్, శివర్ల పర్వతాలు యాదవ్, దాసరి ముత్తయ్య యాదవ్, రెడ్డి పరమేష్, వీరమల్ల వెంకటయ్య గౌడ్, రాశిక పాండయ్య, ఉడుత వెంకటయ్యతో పాటు గ్రామస్థులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అదుపుతప్పి బోల్తాపడిన ప్రైవేట్ బస్సు..




**మోతె, ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** హైదరాబాద్ నుంచి వైజాగ్ వెళ్తున్న మైత్రి ట్రావెల్స్‌కు చెందిన ప్రైవేట్ బస్సు మోతె మండలం హుస్సేనాబాద్ గ్రామ శివారులో బుధవారం ప్రమాదానికి గురైంది. హెచ్‌పీ పెట్రోల్ పంపు ఎదురుగా డ్రైవర్ బస్సును అదుపు చేయలేకపోవడంతో రోడ్డు పక్కకు దూసుకెళ్లి బోల్తాపడింది. ప్రమాద సమయంలో బస్సులో సుమారు 36 మంది ప్రయాణికులు ఉన్నారు.ఈ ఘటనలో ముగ్గురు ప్రయాణికులకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో సూర్యాపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. సమాచారం అందుకున్న మోతె పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదానికి గల కారణాలపై వివరాలు సేకరిస్తున్నారు

# పేద విద్యార్థికి ఆర్థిక సహాయం




**మిర్యాలగూడ ఫ్లాష్ ఇండియా ప్రతినిధి:** మిర్యాలగూడ పట్టణానికి చెందిన పేద విద్యార్థి చందమల్ల వసంత్ తండ్రి పేరు శ్యామ్ సుందర్ వృత్తి తాపీ మేస్త్రి కేఎల్ ఎన్ జూనియర్ కాలేజీలో చదువుకొని గవర్నమెంట్ కాలేజీలో ఎంబిబిఎస్ సీటు సాధించడం జరిగింది.ఈ విద్యార్థికి బుక్స్ కొనుగోలుకై ఆర్థిక సాయం కావాలని అడగిన వెంటనే లైన్స్ క్లబ్ ఆఫ్ మిర్యాలగూడ చైతన్య జనసేవా సంఘం దివ్యాంగ క్లబ్ నుండి ప్రెసిడెంట్ దిద్దకుంట్ల శంకర్ రెడ్డి వెంకటరమణ దంపతులు 20 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందించారు.ఈ కార్యక్రమంలో కోల సైదులు ముదిరాజ్,సింగు రాంబాబు, ఏచూరి భాగ్యలక్ష్మి,ఏచూరి మురారి మరియు కేఎల్ఎన్ కాలేజీ కరస్పాండెంట్ బిక్కుమల్ల కిరణ్ కుమార్,ప్రిన్సిపాల్ నరేందర్ రెడ్డి,డైరెక్టర్స్ పి ఎల్ ఎన్ రెడ్డి, టి హనుమంత రెడ్డి పాల్గొన్నారు.

# క్రీడలకు అండగా దేవరన్ నాయక్







**నల్లగొండ జిల్లా / చింతపల్లి, ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** క్రీడలు విద్యార్థుల్లో క్రమశిక్షణ, పట్టుదల, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ అన్నారు. దేవరకొండలో జరుగుతున్న 70వ SGF జిల్లాస్థాయి కబడ్డీ పోటీలకు ఎమ్మెల్యే కుమారుడు నేనావత్ దేవరన్ నాయక్ సహకారం అందిస్తున్నారు. క్రీడాకారులకు భోజన సౌకర్యం కల్పించడంతో పాటు విజేత జట్లకు బహుమతులు అందించనున్నారు.జిల్లాలోని దేవరకొండ, నల్లగొండ, నకిరేకల్, నాగార్జునసాగర్, మునుగోడు, మిర్యాలగూడ నియోజకవర్గాల నుంచి క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొంటున్నారు. పోటీల్లో ప్రాంతీయతకు తావులేకుండా నిష్పక్షపాతంగా ఎంపైరింగ్ నిర్వహించి ప్రతిభ కనబరిచిన క్రీడాకారులే విజేతలుగా నిలిచేలా చూడాలని ఎమ్మెల్యే నిర్వాహకులను కోరారు.దేవరకొండలో స్పోర్ట్స్ అకాడమీతో పాటు ఇండోర్ స్టేడియం ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని బాలు నాయక్ తెలిపారు. కబడ్డీతో పాటు బ్యాడ్మింటన్, వాలీబాల్, బాస్కెట్‌బాల్ తదితర క్రీడలకు అవసరమైన వసతులు కల్పిస్తామని చెప్పారు.దేవరకొండలో రూ.9.60 కోట్లతో తెలంగాణ పబ్లిక్ స్కూల్, ప్రభుత్వ జూనియర్ కళాశాల అభివృద్ధికి రూ.2.50 కోట్లతో పనులు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. అలాగే మోటార్ వెహికిల్ రిజిస్ట్రేషన్ సేవలు దేవరకొండలోనే అందుబాటులోకి రావడంతో ప్రజలకు సమయం, ప్రయాణ ఖర్చులు ఆదా అవుతున్నాయని పేర్కొన్నారు.క్రీడాకారులను ప్రోత్సహించడంలో దేవరన్ నాయక్ అందిస్తున్న సహకారం అభినందనీయమని నిర్వాహకులు, క్రీడాకారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవరకొండ సబ్ కలెక్టర్, ఎస్‌జీఎఫ్ నిర్వాహకులు, మున్సిపల్ చైర్‌పర్సన్ పున్న శైలజ వెంకటేశ్వర్లు, హనుమంతు వెంకటేష్ గౌడ్, స్థానిక కౌన్సిలర్లు, మారుపాకుల సురేష్ గౌడ్, దొండేటి మల్లారెడ్డి, కొర్ర రాంసింగ్ తదితరులు పాల్గొన్నారు.

# వికసిత్ గ్రామపంచాయతీ ప్రణాళికతో గ్రామాల సమగ్ర అభివృద్ధి

## అక్టోబర్ 2న ప్రతి గ్రామపంచాయతీలో తప్పనిసరిగా గ్రామసభ నిర్వహించాలి

## జూమ్ సమావేశంలో మంత్రి సీతక్క ఆదేశం





**మహాదేవపూర్,ఫ్లాష్ఇండియా ప్రతినిధి :** వికసిత్ గ్రామపంచాయతీ ప్లానింగ్ ప్రాసెస్ ద్వారా గ్రామాల అవసరాలను గుర్తించి సమగ్ర అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) సూచించారు. బుధవారం పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జూమ్ సమావేశంలో వికసిత్ గ్రామపంచాయతీ ప్లానింగ్ ప్రాసెస్, వి.బి.జి. రాంజీ పథకం, గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి కల్పన తదితర అంశాలపై ఆమె మాట్లాడారు.ప్రతి గ్రామపంచాయతీలో స్థానిక అవసరాలకు అనుగుణంగా నూతన అభివృద్ధి పనులను గుర్తించి, గ్రామసభ ద్వారా ఆమోదం పొందిన అనంతరం పరిపాలనా అనుమతులు తీసుకుని పనులు ప్రారంభించాలని మంత్రి తెలిపారు. గాంధీ జయంతిని పురస్కరించుకుని అక్టోబర్ 2న ప్రతి గ్రామపంచాయతీలో తప్పనిసరిగా గ్రామసభ నిర్వహించాలని సూచించారు. గ్రామసభలో ప్రజల అవసరాలు, గ్రామాభివృద్ధికి అవసరమైన పనులను గుర్తించి భవిష్యత్ కార్యాచరణ రూపొందించాలని పేర్కొన్నారు.

**జాబ్ కార్డులు లేని కూలీలకు అవకాశం**

వి.బి.జి. రాంజీ పథకం కింద పనిచేసేందుకు సిద్ధంగా ఉన్న కూలీలకు జాబ్ కార్డు లేకపోతే గ్రామపంచాయతీ ద్వారా దరఖాస్తులు స్వీకరించాలని మంత్రి సూచించారు. దరఖాస్తులను మండల కార్యాలయానికి పంపించి అర్హులైన కూలీలకు జాబ్ కార్డులు జారీ చేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.అదేవిధంగా 18 సంవత్సరాలు నిండిన యువతీ, యువకులు ఉపాధి పనుల్లో పాల్గొనేందుకు సిద్ధంగా ఉంటే వారి తల్లిదండ్రుల జాబ్ కార్డుల్లో పేర్లు చేర్చేందుకు దరఖాస్తులు స్వీకరించాలని సూచించారు.

**కూలీలకు విస్తృతంగా ఉపాధి కల్పించాలి**

ప్రతి గ్రామపంచాయతీలో కూలీలకు ఎక్కువగా పని కల్పించేలా వివిధ అభివృద్ధి పనులను గుర్తించి చేపట్టాలని మంత్రి పేర్కొన్నారు. ప్రతి ఇంటికి ఇంకుడు గుంతలు, గ్రామానికి పంట కుంటలు, ఫీల్డ్ ఛానళ్లు, ఫీడర్ ఛానళ్లలో పూడికతీత వంటి పనులతో పాటు వి.బి.జి. రాంజీ పథకం కింద అనుమతించిన సుమారు 300 రకాల పనులను గుర్తించి చేపట్టాలని సూచించారు.కూలీలకు ఎక్కువగా పని కల్పించిన మేరకు గ్రామపంచాయతీలకు 40 శాతం నిష్పత్తిలో మెటీరియల్ పనులు మంజూరయ్యే అవకాశం ఉంటుందని సీతక్క వివరించారు. తద్వారా గ్రామాల్లో అభివృద్ధి పనులకు అవసరమైన నిధులు సమకూరే అవకాశం ఉందన్నారు. ప్రతి సర్పంచ్ గ్రామాభివృద్ధికి అంకితభావంతో పనిచేయాలని కోరారు.

**పెండింగ్ వేతనాల విడుదలకు చర్యలు**

గత జూన్ నెలలో ఉపాధి హామీ పథకం కింద పనిచేసిన కూలీలకు సంబంధించి కొన్ని రోజుల వేతనాలు పెండింగ్‌లో ఉన్నట్లు సమావేశంలో అధికారులు తెలిపారు. పెండింగ్ వేతనాలను త్వరగా విడుదల చేసేందుకు కేంద్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరుపుతున్నట్లు వెల్లడించారు.వి.బి.జి. రాంజీ పథకం కింద నిధులను వెంటవెంటనే విడుదల చేసేందుకు తగిన చర్యలు తీసుకుంటామని కమిషనర్ దివ్యరాజన్ తెలిపారు.ఈ జూమ్ సమావేశంలో మహాదేవపూర్ ఎంపీడీవో రవీంద్రనాథ్, వి.బి.జి. రాంజీ ఏపీవో కే. శ్రీనివాస్, మహాదేవపూర్ సర్పంచ్ హసీనాబానో, కాళేశ్వరం సర్పంచ్ వెన్నపురెడ్డి మోహన్‌రెడ్డి, ఎలికేశ్వరం సర్పంచ్ పల్లె రాజయ్య, అన్నారం సర్పంచ్ నీర్ల ప్రభాకర్, ఎడపెల్లి సర్పంచ్ మోతే నీలారాణి, ఆయా గ్రామపంచాయతీల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, వి.బి.జి. రాంజీ సిబ్బంది పాల్గొన్నారు.

# మంత్రి పొన్నం ప్రభాకర్ ను మర్యాదపూర్వకంగా కలిసిన బుడిగే సతీష్ గౌడ్...




**గూడూరు,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** గూడూరు మండలం బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు బుడిగే సతీష్ గౌడ్ రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి వర్యులు పొన్నం ప్రభాకర్ ను హైదరాబాద్ క్యాంప్ ఆఫీస్ లో మర్యాదపూర్వకంగా కలిసి పూల బొకే అందించి శాలువాతో సన్మానించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను వేగంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం పనిచేయాలని మంత్రి ఆయనకు సూచించారు క్షేత్రస్థాయిలో కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ వారి కష్టసుఖాల్లో పాలుపంచుకోవాలని రాజకీయాలకి అతీతంగా ప్రజా సేవ చేయాలని గ్రామంలో ఎవరికి ఏ కష్టం వచ్చినా స్థానిక నాయకులతో కలిసి వారి కష్టసుఖాలలో పాలుపంచుకుంటు వారికి ఆర్థిక సహాయ సహకారాలు అందిస్తున్న బుడిగె సతీష్ గౌడ్ ను మంత్రి పొన్నం ప్రభాకర్ అభినందించారు.



# గూడూరులో 17వ సామాజిక తనిఖీ గ్రామ సభ..

**గూడూరు,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** గూడూరు మేజర్ గ్రామపంచాయతీ ఆవరణంలో17వ సామాజిక తనిఖీ గ్రామ సభ సందర్భంగా సర్పంచ్ వాంకుడోత్ సునీత కొమ్మలు నాయక్, మాట్లాడుతూ గ్రామ అభివృద్ధి ఉపాధి హామీ పథకం అమలు సమస్యలపై విస్తృతంగా చర్చించి గత సంవత్సర కాలంలో గ్రామంలో చేపట్టిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఎంజిఎన్ఆర్ఇజిఎస్ పనుల వివరాలను వాటికి సంబంధించిన రికార్డులను సభలో చదివి వినిపించారు అర్హులైన లబ్ధిదారులకు చేనేత పింఛన్లు ధ్రువీకరణ వెరిఫికేషన్ ప్రక్రియను విజయవంతం చేశామని గ్రామంలోని త్రాగునీటి ఎద్దడి పారిశుధ్య నిర్వహణ మరియు వీధి దీపాల సమస్యలపై సుదీర్ఘంగా చర్చించామని వాటి పరిష్కారానికి తగిన చర్య లు చేపడుతామని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ చంటి స్వామి. వార్డు సభ్యులు వాంకుడోత్ శ్రీనివాస్. పత్యం వెంకన్న. చీర బోయిన కుమార్. గార్లపాటి శిరీష. గోనే శిరీష. వాంకుడోత్ మౌనిక. వాంకుడోత్ జ్యోతి. గుగులోత్ వినోద. కార్యదర్శి తిరుమల. డి ఆర్ పి. ఫీల్డ్ అసిస్టెంట్. గ్రామ పంచాయతీ సిబ్బంది గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# మరో గోల్డ్ కైవసం



ఏషియన్ గేమ్స్ 2026లో ఆర్చరీ విభాగంలో భారత ప్లేయర్లు దుమ్మురేపుతున్నారు. తాజాగా మిక్స్‌డ్ కాంపౌండ్ విభాగంలో గోల్డ్ మెడల్ సాధించి చరిత్ర సృష్టించారు. సౌత్ కొరియాతో జరిగిన ఉత్కంఠ పోరులో చికిత తానిపర్తి, సాహిల్ రాజేశ్ జాదవ్ సంచలన విజయం సాధించారు. దీంతో వారు నేరుగా ఒలింపిక్స్‌కు అర్హత సాధించారు. వీరికంటే ముందు మహిళల టీమ్ కాంపౌండ్ విభాగంలోనూ చికిత తానిపర్తి గోల్డ్ మెడల్ కైవసం చేసుకున్నారు. అంతేకాకుండా మహిళల కాంపౌండ్ టీమ్ ఈవెంట్ ఫైన-ల్స్‌లోనూ భారత త్రయం అద్భుత ప్రదర్శనతో గోల్డ్ మెడల్ సాధించింది. చైనా జట్టుతో జరిగిన ఫైనల్స్‌లో ప్రీతిక, చికిత, జ్యోతి సురేఖ టీమ్ 238-234 పాయింట్ల తేడాతో విజయం సాధించింది. ఇక ఇప్పటి వరకు జరిగిన ఏషియన్ గేమ్స్‌లో భారత్ మొత్తం 54 పతకాలను సాధించింది. అందులో 8 స్వర్ణ పతకాలు, 21 రజతాలు, 25 కాంస్య పతకాలు ఉన్నాయి. ఏషియన్ గేమ్స్ సెప్టెంబర్ 19న ప్రారంభించగా అక్టోబర్ 4వరకు జరగనున్నాయి.

# చైనాను చిత్తు చేసి స్వర్ణం కైవసం



ఆసియా క్రీడలు 2026 లో భారత్ ప్లేయర్లు తమ సత్తాను చాటుతున్నారు. ఈ క్రమంలో భారత మహిళా ఆర్చర్లు సరికొత్త రికార్డులతో సంచలనం సృష్టించి బంగారు పతకం సాధించారు. మొదటి నుంచి ఉత్కంఠభరితంగా సాగిన మహిళల కాంపౌండ్ టీమ్ ఈవెంట్ ఫైనల్స్‌లో భారత త్రయం అద్భుత ప్రదర్శన కనబరిచి గోల్డ్ మెడల్‌ను కైవసం చేసుకుంది. బలమైన ప్రత్యర్థి చైనా జట్టుతో జరిగిన తుదిపోరులో ప్రీతిక, చికిత, జ్యోతి సురేఖలతో కూడిన భారత బృందం ఏకాగ్రతతో లక్ష్యాలను ఛేదిస్తూ 238-234 పాయింట్ల తేడాతో చైనాను మట్టి కరిపించింది. ఈ అపూర్వ విజయంతో భారత మహిళల కాంపౌండ్ జట్టు మరోసారి ఆసియా క్రీడల ఛాంపియన్‌గా అవతరించి దేశ కీర్తిని విశ్వవేదికపై సగర్వంగా నిలబెట్టింది. ఈ ఫైనల్ మ్యాచ్‌లో భారత ఆర్చర్లు నెలకొల్పిన స్కోరు అంతర్జాతీయ స్థాయిలో చరిత్ర పుటలకెక్కింది. ఏకంగా 238 పాయింట్లు సాధించడం ద్వారా మహిళల కాంపౌండ్ టీమ్ విభాగంలో ఉన్న ప్రపంచ రికార్డును భారత త్రయం సమం చేసింది. ఒత్తిడికి ఏమాత్రం లోనుకాకుండా ప్రతి రౌండ్‌లోనూ దాదాపు ఖచ్చితమైన 10 పాయింట్లను బాణాలతో సంధించి చైనా జట్టుపై స్పష్టమైన ఆధిపత్యాన్ని ప్రదర్శించారు. ప్రపంచ రికార్డును సమం చేస్తూ ఆసియాడ్ స్వర్ణాన్ని ముద్దాడిన ప్రీతిక, చికిత, జ్యోతిల విజయం పట్ల భారత క్రీడా ప్రాధికార సంస్థ , ఆర్చరీ అసోసియేషన్ ఆఫ్ ఇండియా మరియు క్రీడాభిమానులు సోషల్ మీడియా వేదికగా ఘనంగా ప్రశంసలు కురిపిస్తున్నారు.



# ఏంటి బవుమా అంత కోపం..

సౌతాఫ్రికా, ఆస్ట్రేలియా మధ్య జొహన్నెస్‌బర్గ్‌లోని వాండరర్స్ వేదికగా జరిగిన రెండో వన్డేలో ఆసక్తికర ఘటన చోటుచేసుకుంది. మ్యాచ్ సందర్భంగా రివ్యూ విషయంలో సౌతాఫ్రికా కెప్టెన్ టెంబా బవుమా, వికెట్ కీపర్ క్వింటన్ డికాక్ మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. ఆస్ట్రేలియా ఇన్నింగ్స్ 48వ ఓవర్‌లోని నాలుగో బంతికి లిజాడ్ విలియమ్స్.. ఆస్ట్రేలియా బ్యాటర్ జేవియర్ బార్ట్‌లెట్‌ను ఎల్‌బీడబ్ల్యూ కోసం బలంగా అప్పీల్ చేశాడు. అయితే ఫీల్డ్ అంపైర్ ఔట్ ఇవ్వలేదు. దీంతో రివ్యూ తీసుకోవాలా వద్దా అనే విషయంలో బవుమా, డికాక్ మధ్య చర్చ జరిగింది. చివరకు బవుమా రివ్యూకు వెళ్లగా.. రీప్లేలో మూడు రెడ్స్ కనిపించడంతో బార్ట్‌లెట్ ఔట్‌గా తేలాడు. అప్పటివరకు 28 బంతుల్లోనే 50 పరుగులు చేసిన బార్ట్‌లెట్ పెవిలియన్ చేరాడు. అయితే రివ్యూ సమయంలో బవుమా, డికాక్ మధ్య జరిగిన సంభాషణ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ వీడియోలో ఇద్దరూ ఒకరిపై ఒకరు వేలు చూపించుకుంటూ వాదించుకున్నారు. వారి మధ్య మాటల యుద్ధం కొనసాగుతుండటంతో మార్కో జాన్సెన్ జోక్యం చేసుకుని డికాక్‌ను శాంతింపజేశాడు. దానితో డికాక్ అక్కడి నుంచి వెళ్లిపోయాడు. ఇక బార్ట్‌లెట్‌ను ఔట్ చేసిన బంతిని విలియమ్స్ అద్భుతమైన యా-ర్కర్‌గా వేశాడు. మిడిల్, లెగ్ స్టంప్‌లను లక్ష్యంగా చేసుకుని వేసిన బంతిని బార్ట్‌లెట్ వెనక్కి జరిగి ఆడేందుకు ప్రయత్నించినప్పటికీ బంతిని మిస్ చేశాడు. అది నేరుగా అతడి ప్యాడ్లను తాకింది. దీనితో బాల్ ట్రాకింగ్‌లో బంతి వికెట్లను తాకుతున్నట్లు తేలడంతో ఎల్‌బీడబ్ల్యూ నిర్ధారణ అయింది. రెండో వన్డేలో ఆస్ట్రేలియాపై 32 పరుగుల తేడాతో విజయం సాధించిన సౌతాఫ్రికా మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను 2-0తో కైవసం చేసుకుంది. స్వదేశంలో ఆస్ట్రేలియాపై సౌతాఫ్రికాకు ఇది వరుసగా ఐదో విజయం. ఈ మ్యాచ్‌లో సౌతాఫ్రికా కెప్టెన్ టెంబా బవుమా సెంచరీతో రాణించగా.. డేవిడ్ మిల్లర్ కూడా శతకం సాధించాడు. బ్యాటర్లు ఇచ్చిన భారీ స్కోరును బౌలర్లు కాపాడుకోవడంతో సౌతాఫ్రికా విజయం సాధించింది. మ్యాచ్ అనంతరం బవుమా మాట్లాడుతూ.. ఇది సమష్టి జట్టు ప్రదర్శన అని పేర్కొన్నాడు. ఆరంభంలో పిచ్ బ్యాటింగ్‌కు కాస్త కష్టంగా ఉన్నప్పటికీ పరిస్థితులను ఎదుర్కొని మంచి స్కోరు సాధించామని చెప్పాడు. డేవిడ్ మిల్లర్ అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడాడని, బౌలర్లు కూడా ఒత్తిడిని తట్టుకుని రాణించారని ప్రశంసించాడు. అలాగే తన సెంచరీపై స్పందిస్తూ.. బ్యాటింగ్‌లో జట్టుకు సహకరించడం ఎప్పుడూ సంతోషంగా ఉంటుందని బవుమా చెప్పుకొచ్చాడు.

# న్యూజిలాండ్ సిరీస్.. గిల్, రాహుల్ రంజీ ఆడాల్సిందే



భారత టెస్టు జట్టును గాడిలో పెట్టేందుకు బీసీసీఐ కీలక నిర్ణయం తీసుకోనున్నట్లు తెలుస్తోంది. అక్టోబర్ 22 నుంచి టీమిండియా న్యూజిలాండ్ పర్యటనకు వెళ్లనుంది. అక్కడ ఐదు టీ20లు, ఐదు వన్డేలు, రెండు టెస్టులు ఆడనుంది. డబ్ల్యూటీసీ ఫైనల్ రేసులో నిలవాలంటే భారత్‌కు ఈ టెస్టు సిరీస్ అత్యంత కీలకం. దీంతో సీనియర్ ప్లేయర్లంతా దేశవాళీ రెడ్ బాల్ క్రికెట్ ఆడాలని బీసీసీఐ ఆదేశాలు జారీ చేయనుంది. ఈ క్రమంలో కెప్టెన్ శుభ్‌మన్ గిల్, వికెట్ కీపర్ కేఎల్ రాహుల్‌లను రంజీ ట్రోఫీలో బరిలోకి దింపే అవకాశం ఉంది. బీసీసీఐ వైద్య బృందం నుంచి క్లియరెన్స్ లభించిన ప్రతి సీనియర్ ప్లేయర్ కనీసం ఒక రెడ్ బాల్ మ్యాచ్ ఆడాలనేదే బీసీసీఐ ఉద్దేశం. అయితే ఆటగాళ్ల పని భారం, ఫిట్‌నెస్‌ను పరిగణనలోకి తీసుకుని ఈ నిర్ణయం అమలు చేయనుంది. ఇటీవల గాయాలతో ఇబ్బందులు ఎదుర్కొన్న ఆకాశ్ దీప్, నితీశ్ కుమార్ రెడ్డి ప్లేయర్లపై సెలెక్టర్లు ప్రత్యేకంగా దృష్టి పెట్టనున్నారు. వారి ఫిట్‌నెస్, మ్యాచ్ ప్రాక్టీస్‌ను పరిశీలించిన తర్వాతే తుది నిర్ణయం తీసుకోనున్నారు. మరోవైపు సీనియర్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా విషయంలో మాత్రం మరింత జాగ్రత్తగా ఉండాలని టీమ్ మేనే-జ్‌మెంట్ భావిస్తోంది. అతడిని రంజీ మ్యాచ్ ఆడించకుండా.. అవసరమైతే భారత్ 'ఎ' తరఫున ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌లో బరిలోకి దించే అవకాశం ఉంది.

**ఎందుకీ నిర్ణయం?**

టెస్టు సిరీస్‌కు ముందు రెడ్‌బాల్ క్రికెట్‌లో తగినంత ప్రాక్టీస్ లేకపోవడం గతంలో టీమిండియాకు ఇబ్బందులు తెచ్చిపెట్టింది. ముఖ్యంగా 2024లో సొంతగడ్డపై న్యూజిలాండ్‌తో జరిగిన టెస్టు సిరీస్‌లో భారత్ 0-3తో క్లీన్‌స్వీప్ కావడం బీసీసీఐకి చేదు అనుభవంగా మిగిలింది. ఈ నేపథ్యంలో న్యూజిలాండ్ పర్యటనకు వెళ్లే ముందు ఆటగాళ్లకు రెడ్‌బాల్ మ్యాచ్ ప్రాక్టీస్ ఉండేలా చూడాలని బోర్డు భావిస్తున్నట్లు సమాచారం. టెస్టుల్లో భారత జట్టు ప్రదర్శనపై కొంతకాలంగా చర్చ జరుగుతున్న నేపథ్యంలో.. న్యూజిలాండ్‌లో మెరుగైన ఫలితాలు సాధించేందుకు బీసీసీఐ ఇప్పటి నుంచే ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది.

# బిజినెస్



# ఖరీదైపోతున్న స్మార్ట్‌ఫోన్లు

ఏఐ డేటా సెంటర్ల కారణంగా డీర్యామ్, ఇతర మెమరీ చిప్‌ల కొరత, డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ పడిపోవడంతో దేశంలో స్మార్ట్‌ఫోన్ల ధరలు ఆకాశాన్నంటాయి. మార్కెట్ పరిశోధనా సంస్థ కౌంటర్‌పాయింట్ రీసెర్చ్ నివేదిక ప్రకారం, భారత స్మార్ట్‌ఫోన్ సగటు అమ్మకపు ధర గతేడాదితో పోలిస్తే ఏకంగా 16 శాతం పెరిగి, రికార్డు స్థాయిలో రూ. 26,500కి చేరింది. ఈ భారం ముఖ్యంగా రూ. 10,000 లోపు ఉండే బడ్జెట్ ఫోన్లపై పడింది. ఈ విభాగంలో ధరలు 32 శాతం పెరగడంతో, సరఫరా ఏకంగా 65 శాతం పడిపోయాయి. అయితే, రూ. 20,000 పైబడిన ప్రీమియం విభాగంలో మాత్రం ఉచిత ఈఎంఐ ఎంపికలు, ఎక్స్ఛేంజ్ ఆఫర్ల కారణంగా అమ్మకాలు స్థిరంగా సాగుతున్నాయి. అయితే, పరిశ్రమలోని మెజారిటీ కంపెనీలు పెరిగిన ఖర్చుల భారాన్ని కస్టమర్లపై మోపుతూ ధరలను పెంచేయగా, చైనా బ్రాండ్ వన్‌ప్లస్ మాత్రం భిన్నమైన వ్యూహాన్ని అమలు చేసింది. ముందుగానే విడిభాగాలను తక్కువ ధరలకు నిల్వ చేసుకోవడం ద్వారా, తమ ఫోన్ల ధరల పెంపును 8 శాతానికే పరిమితం చేసింది. స్థానికంగా అసెంబుల్ చేస్తున్నప్పటికీ విడిభాగాల దిగుమతులపైనే ఎక్కువగా ఆధారపడుతుండటంతో, మెమరీ చిప్‌ల ధరలు 2028 వరకు తగ్గే అవకాశం లేదని పరిశ్రమ వర్గాలు వెల్లడించాయి.

# ధరలు పెంచేసిన స్కోడా




వాహన తయారీ ఖర్చులు, ముడి సరుకుల ధరలు ఆకాశాన్నంటుతుండటంతో ప్రముఖ కార్ల తయారీ సంస్థ 'స్కోడా ఆటో ఇండియా' కీలక నిర్ణయం తీసుకుంది. అక్టోబర్ 1 నుండి దేశీయంగా తమ అన్ని కార్ల ధరలను 1.2 శాతం వరకు పెంచుతున్నట్లు ప్రకటించింది. ఈ ధరల పెంపు ఎక్స్-షోరూమ్ ధరలపై వర్తిస్తుందని, ఎంచుకునే మోడల్, వేరియంట్‌ను బట్టి గరిష్ఠంగా రూ. 20,000 వరకు భారం పడుతుందని కంపెనీ తెలిపింది. ప్యాసింజర్ వాహనాల మార్కెట్లో విపరీతమైన పోటీ ఉన్నప్పటికీ, పెరిగిన ఉత్పత్తి నిర్వహణ వ్యయ భారాన్ని అధిగమించేందుకు ఈ మార్పు అనివార్యమైందని స్కోడా స్పష్టం చేసింది. ఈ ఏడాది తమ కైలాక్, కుషాక్, స్లావియా మోడళ్లతో పాటు కొడియాక్, ఆక్టేవియా ఆర్ఎస్‌లలో సరికొత్త ఫీచర్లను అందుబాటులోకి తెచ్చామని, దీనివల్ల ఒక్క కైలాక్ మోడల్ మాత్రమే 75,000 యూనిట్ల అమ్మకాల మార్కును సాధించింది. మొత్తం అమ్మకాలు కూడా ఇప్పటికే 2.5 లక్షలకు పైగా నమోదయ్యాయి. అయితే, తయారీలో పెరుగుతున్న భారాన్ని కొంత వినియోగదారులకు బదిలీ చేయక తప్పట్లేదని కంపెనీ వివరించింది. దేశీయంగా ఉన్న డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని సేల్స్, సర్వీస్ టచ్‌పాయింట్లను వేగంగా విస్తరిస్తున్నట్టు స్కోడా ఆటో పేర్కొంది.

# 'యాపిల్ పే' సేవలు ప్రారంభం




ప్రముఖ గ్లోబల్ టెక్ దిగ్గజం యాపిల్ తన ప్రతిష్ఠాత్మక కాంటాక్ట్‌లెస్ డిజిటల్ చెల్లింపుల వేదిక 'యాపిల్ పే' సేవలను భారతదేశంలో అధికారికంగా ప్రారంభించింది. ప్రముఖ ప్రైవేట్ రంగ బ్యాంక్ అయిన 'యాక్సిస్ బ్యాంక్'తో భాగస్వామ్యం కుదుర్చుకుని దేశీయ చెల్లింపుల మార్కెట్లోకి ఈ సేవలను అందుబాటులోకి తెచ్చినట్లు బుధవారం సంస్థ వెల్లడించింది. ఐఫోన్ , ఐప్యాడ్ , యాపిల్ వాచ్ వినియోగదారులు తమ పరికరాల్లో యాపిల్ వాలెట్ ద్వారా ఈ సేవలను ఉపయోగించుకోవచ్చని, త్వరలోనే మ్యాక్ కంప్యూటర్లలోనూ ఈ సదుపాయాన్ని తీసుకువస్తామని స్పష్టం చేసింది. ప్రస్తుతానికి యాక్సిస్ బ్యాంక్ జారీ చేసిన వీసా, మాస్టర్‌కార్డ్ క్రెడిట్ కార్డుల ద్వారా కాంటాక్ట్‌లెస్ ఎన్ఎఫ్‌సీ పద్ధతిలో రిటైల్ స్టోర్లలో ట్యాప్ చేసి చెల్లించడంతో పాటు ప్రముఖ ఆన్‌లైన్ యాప్స్, వెబ్‌సైట్లలో సులభంగా చెల్లింపులు జరిపే అవకాశం కల్పించారు. భారత డిజిటల్ విప్లవం, యూపీఐ మార్కెట్ వృద్ధి నేపథ్యంలో యాపిల్ పే ప్రవేశం అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ సందర్భంగా యాపిల్ పే, యాపిల్ వాలెట్ విభాగాల వైస్ ప్రెసిడెంట్ జెన్నిఫర్ బెయిలీ మాట్లాడుతూ.. సాంకేతిక పరిజ్ఞానం, నగదు రహిత లావాదేవీలను వేగంగా అందిపుచ్చుకుంటూనే భద్రత, గోప్యతకు అత్యున్నత ప్రాధాన్యతనిచ్చే స్మార్ట్ వినియోగదారులు భారత్‌లో ఉన్నారని ప్రశంసించారు. అటువంటి డైనమిక్ మార్కెట్‌లోకి అత్యున్నత భద్రతా ప్రమాణాలతో కూడిన యాపిల్ పే సేవలను ప్రవేశపెట్టడం ఎంతో సంతోషాన్నిస్తోందని ఆమె పేర్కొన్నారు. కార్డు వివరాలు వ్యాపారులకు చేరకుండా బయోమెట్రిక్ (ఫేస్ ఐడీ, టచ్ ఐడీ) భద్రతతో లావాదేవీలు పూర్తయ్యేలా తీర్చిదిద్దిన ఈ సేవలకు రానున్న రోజుల్లో మరిన్ని బ్యాంకులు, నెట్‌వర్క్‌లను జోడించనున్నట్లు కంపెనీ తెలిపింది.

# స్పామ్ కాల్స్‌పై ట్రాయ్ కొరడా




నిత్యం వేధించే స్పామ్ కాల్స్‌కు చెక్ పెట్టేందుకు టెలికాం రెగ్యులేటరీ ట్రాయ్ సరికొత్త నిబంధనలను తీసొచ్చింది. దీని ప్రకారం, ఇకపై ప్రతి చిన్న స్పామ్ కాల్‌పై వినియోగదారులు ప్రత్యేకంగా ఫిర్యాదు చేయాల్సిన అవసరం లేదు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), మెషిన్ లెర్నింగ్ ఆధారిత సిస్టమ్స్ ద్వారా స్పామ్ కాల్‌ను గుర్తించిన రెండు గంటల్లోనే టెలికాం ఆపరేటర్లు ఆ డేటాను పరస్పరం పంచుకోవాల్సి ఉంటుంది. సదరు నంబర్ కేవైసీ (కేవైసీ) ఆధారంగా తనిఖీ చేసి, 10 రోజుల వ్యవధిలో 5 అంతకంటే ఎక్కువ కనెక్షన్ల నుంచి ఇలాంటి వ్యాపార లేదా ప్రమోషనల్ కాల్స్ వచ్చినట్లు తేలితే, ఆ సిమ్‌లతో పాటు ఆ వ్యక్తికి ఉన్న అన్ని ఔట్‌గోయింగ్ సేవలను ఆపరేటర్లు వెంటనే నిలిపివేస్తారు. ఈ నిబంధనల ప్రకారం మొదటిసారి ఉల్లంఘనకు పాల్పడితే 15 రోజుల పాటు, ఆ తర్వాత కూడా మళ్లీ స్పామ్ కాల్స్ చేస్తే ఏకంగా ఒక ఏడాది పాటు సదరు కస్టమర్ అన్ని సిమ్‌లు, ట్రంక్ లైన్లను డిస్‌కనెక్ట్ చేసి బ్లాక్‌లిస్ట్‌లో పెడతారు. అయితే అత్యవసర సేవల కోసం కేవలం ఒక నంబర్‌కు మాత్రమే పరిమిత సదుపాయం ఉంటుంది. కస్టమర్లు ప్రమోషనల్ కాల్స్ వద్దనుకుంటే '1909' నంబర్‌కు 'బ్లాక్ ప్రోమో' అని మెసేజ్ పంపితే సరిపోతుంది.



# మరోసారి పెరిగిన ధరలు

గత రెండు రోజులుగా రికార్డు స్థాయిలో పతనమైన బంగారం ధరలు నేడు యూటర్న్ తీసుకున్నాయి. భారత్‌లో నేడు మేలిమి బంగారం ధర రూ.770 మేర పెరిగింది. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం, నేటి ఉదయం 10.30 గంటల సమయంలో హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,49,570కు ఎగబాకింది. నిన్నటి ముగింపుతో పోలిస్తే రూ.770ల మేర పెరిగింది. 22 క్యారెట్ల ఆర్నమెంటల్ పసిడి కూడా రూ.700ల మేర పెరిగి రూ.1,37,100కు చేరుకుంది. 18 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.1,12,180కు పెరిగింది.

నగరంలో వెండి ధరః మాత్రం స్థిరంగా కొనసాగుతోంది. ప్రస్తుతం కిలో వెండి ధర రూ.2.4 లక్షలుగా ఉంది.



## ఇండస్ట్రీని కాదు దర్శకుల ఆలోచనా విధానాన్ని...

టాలీవుడ్, కోలీవుడ్ ఇండస్ట్రీల్లో తనదైన నటనతో గుర్తింపు తెచ్చుకున్న అమలా పాల్ గత కొద్ది కాలంగా సినిమాలకు దూరమయ్యారు. వ్యక్తిగత జీవితంలో బిజీగా ఉన్న ఈ భామ తాజాగా, చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారాయి. ఓ ఈవెంట్‌లో పాల్గొన్న ఆమె దక్షిణాది చిత్ర పరిశ్రమలో హీరోయిన్లను సరిగ్గా చూపించడం లేదనే విమర్శలపై స్పందిస్తూ.. దీనికి పూర్తి పరిశ్రమను నిందించడం కరెక్ట్ కాదని తేల్చిచెప్పారు. కొన్ని చిత్రాల్లో మహిళల చూపించే విధానం సరిగ్గా లేకపోవడానికి ఇండస్ట్రీ కారణం కాదని, అది కేవలం ఆ సినిమా టీమ్ లేదా ఆ డైరెక్టర్ ఆలోచనా లోపం కావచ్చని అమలా పాల్ పేర్కొన్నారు. ఏదేమైనా కాలం మారుతోందని, ఇప్పుడు ఇండస్ట్రీలోలేడీ ఓరియెంటెడ్ చిత్రాలు భారీగా వస్తున్నాయని గుర్తుచేశారు.తాను ఇండస్ట్రీకి వచ్చి 15 ఏళ్లకు పైగా అయిందని, ప్రస్తుతం మహిళలు తమకు తగిన స్థానం కోసం తీవ్రంగా శ్రమిస్తున్నారని చెప్పారు. ఈ మార్పు రాబోయే రోజుల్లో మరింత సానుకూల వాతావరణాన్ని సృష్టిస్తుందని నమ్ముతున్నట్లు తెలిపారు. ఇదే కాకుండా తన కెరీర్ జర్నీ గురించి చెబుతూ.. ఎప్పుడూ ఒకే రకమైన మూస పద్ధతి పాత్రలు కాకుండా కొత్తదనమున్న సినిమాలే చేయడానికి ఇష్టపడ్డానని చెప్పారు. అందులో భాగంగానే 2019లో 'ఆడై' లాంటి బోల్డ్, రిస్క్ ఉన్న సినిమా చేశానని గుర్తుచేసుకున్నారు. ఆ సమయంలో తన ఇమేజ్ ఏమవుతుందనే భయం, మళ్లీ అలాంటి పాత్రలే వస్తాయేమోననే ఆందోళన ఉండేదని తెలిపారు. అయితే ఇన్ని సంవత్సరాల అనుభవం తర్వాత వెనక్కి తిరిగి చూసుకుంటే.. ఆ రోజు తాను చేసిన సాహసం చాలా పెద్దదనిపించిందని, ఇప్పుడు మాత్రం మళ్లీ అలాంటి సినిమా చేయలేనని అమలా పాల్ నిజాయితీగా అంగీకరించారు.




## త్వరలోనే విడుదలకు సిద్ధం

అత్యధిక ప్రేక్షకాదారణ పొందిన హారర్ థ్రిల్లర్ మూవీస్‌లో 'డిమాంటే కాలనీ' ఒకటి. ఇప్పటికే రెండు భాగాలుగా వచ్చిన ప్రేక్షకులను ఆకట్టుకున్న ఈ ఫ్రాంచైజీ నుంచి రాబోతున్న మూడో భాగం 'డిమాంటే కాలనీ-3' కోసం ఎంతో ఈగర్‌గా వెయిట్ చేస్తున్నారు. నటుడు అరుళ్ నిధి హీరోగా, ఆర్.అజయ్ జ్ఞానముత్తు దర్శకత్వంలో తెరకెక్కుతోన్న ఈ మూవీ విడుదలపై ఇటీవల కోర్డు స్టే విధించిన విషయం తెలిసిందే. ఈ సినిమా నిర్మాణ భాగస్వామ్యం, హక్కుల విషయమై 'వైట్ నైట్స్ ఎంటర్‌టైన్‌మెంట్' సంస్థకు అండ్ చిత్ర దర్శకుడు అజయ్ జ్ఞానముత్తుకు మధ్య వివాదం తలెత్తగా.. ఒప్పంద నిబంధనలను ఉల్లంఘించారంటూ సదరు నిర్మాణ సంస్థ కోర్టును ఆశ్రయించింది. ఈ మేరకు మద్రాస్ హైకోర్టు సినిమా విడుదలపై తాత్కాలిక స్టే విధించింది. అయితే.. తాజా సమాచారం ప్రకారం.. తాజా విచారణ అనంతరం కోర్టు ఈ స్టే ఆర్డర్‌ను పూర్తిగా ఎత్తివేసింది. దీనితో ఈ చిత్రాన్ని విడుదల చేయడానికి ప్రస్తుత నిర్మాణ సంస్థ 'ప్యాషన్ స్టూడియోస్' కు న్యాయస్థానం అనుమతి ఇచ్చింది. ఈ మేరకు.. చిత్ర విడుదల తేదీకి సంబంధించిన అధికారిక ప్రకటన త్వరలోనే వెలువడే అవకాశం ఉంది.




## తెలుగు రాష్ట్రాల థియేట్రికల్ రైట్స్..

సూపర్ స్టార్ మహేష్ బాబు, దర్శక ధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి కాంబినేషన్‌లో వస్తున్న మోస్ట్ యాంటిసిపేటెడ్ గ్లోబల్ ప్రాజెక్ట్ వారణాసి. ఇంకా షూటింగ్ దశలోనే ఉన్న ఈ చిత్రం రిలీజ్‌కు ముందే బిజినెస్ వర్గాల్లో ప్రభంజనం సృష్టిస్తోంది. ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల థియేట్రికల్ హక్కుల కోసం టాలీవుడ్ ప్రముఖ డిస్ట్రిబ్యూషన్ సంస్థలు పోటీ పడుతున్నాయి.ఫిల్మ్ నగర్ ట్రేడ్ వర్గాల సమాచారం ప్రకారం వారణాసి తెలుగు రాష్ట్రాల థియేట్రికల్ హక్కులు దక్కించుకోవడానికి టాలీవుడ్ అగ్ర నిర్మాతలయిన దిల్ రాజు శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్, మైత్రీ మూవీ మేకర్స్, మరియు సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ పోటీపడుతున్నారు. అటు ఇటుగా రూ. 275 కోట్ల మేర ఆఫర్ చేస్తున్నారట. ఇప్పటివరకు తెలుగు చలనచిత్ర చరిత్రలో తెలుగు రాష్ట్రాల్లో అత్యధిక బిజినెస్ చేసిన చిత్రంగా రాజమౌళి RRR పేరిట ఉంది. ఆ సినిమా సుమారు రూ. 225 కోట్ల ధర పలికాయి. ఆర్ ఆర్ ఆర్ కంటే రూ. 50 కోట్లకు పైగా ఎక్కువ కోట్ చేస్తున్నారు. అయితే ఈ డీల్ ఇంకా క్లోజ్ కాలేదు. మూడు ప్రముఖ సంస్థలు రెండు తెలుగు రాష్ట్రాలు కలిపి ఒకరికి మించి మరొకరు ఆఫర్ చేయడంతో విజయదశమి తరువాత ఒక నిర్ణయం తీసుకునే ఆలోచనలో ఉన్నారు మేకర్స్. ఒక పక్కన రాజమౌళి సినిమాలు రెగ్యులర్ గా చేసే ఒక సంస్థ,డిస్ట్రిబ్యూటర్స్ కి సినిమా మేమే బిజినెస్ చూస్తాము, సినిమా మీకే అని పలువురు పంపిణీ దారులకు మాట ఇస్తున్నారట. ఫైనల్ డీల్ ఫిక్స్ అయ్యేసరికి ఈ ఆఫర్ రేంజ్ మరిన్ని కోట్లు దాటే అవకాశముందని ట్రేడ్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

## అదృష్టంగా భావిస్తున్నా



కన్నడ స్టార్ హీరో శివరాజ్ కుమార్ ఓ వైపు వైవిధ్యమైన పాత్రలు పోషిస్తూనే, మరోవైపు హీరోగా వరుస సినిమాలతో అలరిస్తున్నారు. ఆయన ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా యాక్షన్ థ్రిల్లర్ 'బెయిల్'. టాలెంటెడ్ డైరెక్టర్ పవన్ వడయార్ తెరకెక్కిస్తున్న ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ సంస్థ కేవీఎన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై వెంకట్ కె. నారాయణ నిర్మిస్తున్నారు. ఈ సినిమాకు అజనీష్ లోక్‌నాథ్ సంగీతం అందిస్తున్నారు. ఇందులో సాయి కుమార్, జయరామ్, ధీక్షిత్ శెట్టి, సంజన ఆనంద్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ చిత్రం అక్టోబర్ 2న ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఈ నేపథ్యంలో సినిమా ప్రమోషన్స్‌లో పాల్గొన్న శివరాజ్ కుమార్.. తను నటిస్తున్న మరో మోస్ట్ అవైటెడ్ ప్రాజెక్ట్ 'జైలర్ 2' గురించి కొన్ని ఆసక్తికర విషయాలు పంచుకున్నారు.సూపర్ స్టార్ రజనీకాంత్ నటిస్తున్న ఈ క్రేజీ సీక్వెల్‌లో తనకు కాస్త ఎక్కువ స్క్రీన్ స్పేస్ లభించడం చాలా ప్రత్యేకమైన విషయమని ఆయన తెలిపారు. దర్శకుడు నెల్సన్ దిలీప్ కుమార్ తమ పాత్రలను డిజైన్ చేసిన తీరు, వాటిని ఉపయోగించుకున్న విధానం చాలా ఆసక్తికరంగా, ఉత్సాహభరితంగా ఉందని శివరాజ్ కుమార్ పేర్కొన్నారు. అలాగే, ఇండియన్ సినిమా లెజెండ్, సూపర్ స్టార్ రజనీకాంత్‌తో కలిసి మళ్లీ స్క్రీన్ షేర్ చేసుకోవడం ఎంతో ఆనందదాయకమని, దీన్ని ఒక గొప్ప అదృష్టంగా భావిస్తున్నానని ఆయన సంతోషం వ్యక్తం చేశారు. కాగా బ్లాక్‌బస్టర్ హిట్ అయిన 'జైలర్' చిత్రానికి సీక్వెల్‌గా వస్తున్న ఈ 'జైలర్ 2' సినిమాను అక్టోబర్ 15న థియేటర్లలోకి తీసుకొచ్చేందుకు మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. రజనీకాంత్, శివరాజ్ కుమార్ కాంబినేషన్‌లో రాబోతున్న ఈ భారీ మల్టీస్టారర్ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి.

## ఎలా ఉందంటే?



ఆది సాయికుమార్ హీరోగా నటిస్తున్న లేటెస్ట్ క్రైమ్ ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్ మూవీ 'సబ్ ఇన్‌స్పెక్టర్ యుగంధర్'. నగరంలో వరుస హత్యలు చేస్తూ పోలీసులను తప్పుదోవ పట్టించే ఒక సైకో కిల్లర్ చుట్టూ ఈ సినిమా కథ తిరుగుతుండగా.. అతడు అంతు తేల్చేందుకు ఎస్ఐ యుగంధర్‌గా ఆది సాయి కుమార్ రంగంలోకి దిగుతాడు. 24 గంటల్లోనే శవాలు మాయమవడం, ఒక ప్రిన్సిపాల్ సెక్రటరీ మృతదేహం అదృశ్యమవ్వడం వంటి పరిణామాలతో ఈ కథ ఉత్కంఠగా సాగుతుంది. తాజాగా ఈ సినిమా నుంచి ట్రైలర్ రిలీజ్ చేశారు మేకర్స్. ఇందులో చూపించిన సస్పెన్సింగ్ సీన్స్, హీరో యాక్షన్ వంటివి సినిమాకు హైలెట్‌గా నిలుస్తున్నాయి. కాగా.. రాఘవేంద్ర కటారీ దర్శకత్వం వహించిన ఈ మూవీలో మేఘలేఖ హీరోయిన్‌గా నటిస్తోంది. మార్కస్ ఎన్ సంగీతం అందిస్తున్నాడు. ట్రైలర్‌తో భారీ అంచనాలు ఏర్పడిన ఈ మూవీ అక్టోబర్ 2న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు సిద్ధం అవుతున్నది. 'ఒక రహస్యమైన కేసు.. నిర్భయమైన అధికారి.. ప్రమాదాలతో కూడిన మిషన్..' అనే ఇంట్రెస్టింగ్ క్యాప్షన్‌తో షేర్ చేసిన ఈ ట్రైలర్ ప్రజెంట్ నెట్టింట మంచి స్పందన సొంతం చేసుకుంటుంది.

## చాన్స్ దక్కించుకున్న యంగ్ బ్యూటీ?





టాలీవుడ్‌లో సరికొత్త గ్లామర్‌తో వరుస అవకాశాలు దక్కించుకుంటూ టాక్ ఆఫ్ ది టౌన్‌గా మారుతోంది యంగ్ బ్యూటీ సాత్మిక వీరవల్లి. దుల్కర్ సల్మాన్ హీరోగా పవన్ సాధినేని దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న 'ఆకాశంలో ఒక తార' సినిమాతో ఈ భామ హీరోయిన్‌గా టాలీవుడ్ ఎంట్రీ ఇస్తోంది. ఈ చిత్రం దీపావళి కానుకగా నవంబర్ 20న గ్రాండ్‌గా థియేటర్లలోకి రావడానికి సిద్ధవవుతోంది. అయితే, తన మొదటి సినిమా ఇంకా విడుదల కాకముందే ఈ ముద్దుగుమ్మ తన అందం, ప్రతిభతో ఇండస్ట్రీలోని ప్రముఖ దర్శకనిర్మాతలను బాగా ఆకట్టుకుంటోంది. ఈ క్రమంలోనే సాత్మికకు టాలీవుడ్‌లో ఒక బంపర్ ఆఫర్ వరించినట్లు సోషల్ మీడియాలో పలు పోస్టులు వైరల్ అవుతున్నాయి.అక్కినేని నాగచైతన్య కెరీర్‌లో మైల్‌స్టోన్ ప్రాజెక్ట్‌గా రాబోతున్న 'NC-25' సినిమాలో సాత్మిక హీరోయిన్‌గా ఎంపికైనట్లు టాక్. దర్శకుడు కిశోర్ చెప్పిన సరికొత్త కథ, వైవిధ్యమైన పాత్ర నాగచైతన్యకు బాగా నచ్చడంతో ఈ ప్రాజెక్ట్‌కు ఆయన గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు సమాచారం. ఈ క్రేజీ ల్యాండ్‌మార్క్ మూవీ కోసం నాగచైతన్య సరసన కొత్త ముఖం అయితే బాగుంటుందని భావించిన మేకర్స్.. సాత్మికను హీరోయిన్‌గా ఫైనల్ చేసినట్లు టాక్. డెబ్యూ సినిమా రిలీజ్ కాకముందే అక్కినేని హీరో పక్కన నటించే అవకాశం రావడంతో సోషల్ మీడియాలో సాత్వికు పేరు మార్మోగిపోతోంది.




## అప్పుడే ఓటీటీ రిలీజ్‌కు సిద్ధమైన మండాడి..

తమిళ నటుడు సూరి, టాలీవుడ్ నటుడు సుహాస్ కలయికలో వచ్చిన మోస్ట్ ఎవైటెడ్ స్పోర్ట్స్ యాక్షన్ డ్రామా 'మండాడి'. మదిమారన్ పుగళేంది దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రంలో మహిమా నంబియార్ హీరోయిన్‌గా నటించగా.. సీనియర్ నటుడు సత్యరాజ్, అచ్యుత్ కుమార్ కీలక పాత్రల్లో కనిపించారు. జీ.వీ. ప్రకాష్ కుమార్ సంగీతం అందించాడు. తమిళనాడు సముద్ర తీర ప్రాంత నేపథ్యం, అక్కడి మత్స్యకార కుటుంబాల జీవితాలు, ఉత్కంఠభరితంగా సాగే సాంప్రదాయ పడవ పోటీల ఆధారంగా తెరకెక్కిన ఈ చిత్రం సెప్టెంబర్ 10న ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఇది టాలీవుడ్ నటుడు సుహాస్‌కు తమిళంలో మొదటి చిత్రం కావడంతో తెలుగు ప్రేక్షకుల్లో ఈ మూవీపై భారీ హైప్ ఉంది. వారి అంచనాలకు తగ్గట్టుగానే ఈ చిత్రంలో సుహాస్ తన నటనతో అందరిని ఆకట్టుకున్నాడు. భారీ అంచనాల మధ్య వచ్చిన ఈ చిత్రం పాజిటివ్ టాక్ సొంతం చేసుకుంది. ఇదిలా ఉంటే.. విడుదలైన కొన్ని రోజులకే 'మండాడి' డిజిటల్ స్ట్రీమింగ్‌కు సంబంధించిన ఇంట్రెస్టింగ్ అప్డేట్ వచ్చింది. ఈ మూవీకి సంబంధించిన డిజిటిల్ స్ట్రీమింగ్ రైట్స్‌ను ప్రముఖ ఓటీటీ సంస్థ నెట్‌ఫ్లిక్స్ భారీ ధరకు సొంతం చేసుకోగా.. అక్టోబర్ 8 నుంచి స్ట్రీమింగ్‌కు తీసుకురాబోతున్నట్లు తెలుస్తుంది. అయితే.. దీనిపై అఫీషియల్ అప్డేట్ రావాల్సి ఉంది.

## బాలీవుడ్ తెరంగేట్రానికి ముహూర్తం ఎప్పుడు..?

టాలీవుడ్ ముద్దుగుమ్మ శ్రీలీల బాలీవుడ్‌లో ఎంత త్వరగా ఇంట్రడ్యూసై కెరీర్ బిల్డ్ చేసుకుందామా అనుకుంటే అంతంత వెనక్కు వెళుతోంది డెబ్యూ ఫిల్మ్. 2024లో మొదలు పెట్టిన మ్యూజికల్ లవ్ స్టోరీ ఇప్పటికీ పూర్తి కాలేదు. కార్తీక్ ఆర్యన్ హీరోగా అనురాగ్ బసు దర్శకత్వంలో తెరకెక్కుతోన్నఈ మూవీని గత ఏడాది దీపావళికే తీసుకొస్తామన్నారు కానీ ఈ ఏడాది దీపావళికి కూడా వచ్చేట్లుగా లేదు.కార్తీక్ ఆర్యన్ ఇతర కమిట్మెంట్స్ వల్ల ఈ సినిమా షూట్ పోస్ట్ పోన్ అవుతూ వస్తుంది. ఇటీవల కబీర్ ఖాన్ సినిమా షూటింగ్‌లో కార్తీక్ ఆర్యన్ గాయపడంతో షూటింగ్స్‌కు బ్రేక్ ఇచ్చాడు. కోలుకుని తిరిగి వచ్చాక.. అనురాగ్ బసు మూవీ షూటింగ్‌లో పాల్గొంటున్నాడు. ప్రస్తుతం కార్తీక్ ఆర్యన్ అండ్ శ్రీలీలపై సన్నివేశాలు చిత్రీకరిస్తున్నాడు డైరెక్టర్. తు మేరీ జిందగీ హై టైటిల్ పరిశీలనలో ఉన్న ఈ మూవీ ఈ ఏడాది కూడా రిలీజ్ కావడం కష్టమేనన్న టాక్ వినిపిస్తోంది. బాలీవుడ్ ప్రాజెక్ట్ వల్ల వైరల్ వయ్యారీ కూడా అజిత్ మూవీని వదిలేసుకున్నట్లు టాక్. అజిత్64వ మూవీకి శ్రీలీల ఫిక్సైంది. డేర్ డెవిల్ నవంబర్ 2 నుండి షూటింగ్ మొదలు కానుంది. అధిక్ రవిచంద్రన్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న మూవీలో డ్యాన్సింగ్ క్వీన్ ప్లేసులోకి ఆషికా రంగనాథ్ నేమ్ పరిశీలిస్తున్నట్లు బాలీవుడ్ బజ్. ఇక ధనుష్‌తో నటిస్తున్న ఓమ్ దసరా రేసు నుండి తప్పుకున్న సంగతి తెలిసిందే. టాలీవుడ్‌లో వరుస ఫ్లాప్స్ టేస్ట్ చేయడంతో వైరల్ వయ్యారీని లైట్ తీసుకుంటున్నారు మేకర్స్.



Edited, Printed, Published & Owned by **KOMARAJU SRINIVASULU** and Printed at **Ramu Graphics**, Shop No:5,Near Clock Tower Church Compound, Nalgonda District (T.S.), Published From: KOMARAJU SRINIVASULU, Village: Anthaiah Gudem, Post: Duppalapally, Mandal: Thipparthy-508247, Dist. Nalgonda, (T.S) **Editor: KOMARAJU SRINIVASULU. Cell: 7730032999, E-mail: flashindiadaily@gmail.com, www.flashindianews.com, RNI No. APTEL/2010/33229**